



నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
19 వ వసంతంలోకి ...
రంగారెడ్డి వికారాబాద్ మేడ్చల్
శుక్రవారం 31 అక్టోబర్ 2025 : పేజీలు 12

- చేతికొచ్చిన పంట నేలపాలు.. సాగు ఖర్చు నీళ్లపాలు
- జిల్లాలో475 ఎకరాల్లో వరి, పత్తిపంట నష్టం..
- అత్యధికంగా యాచారం, కేశంపేట్ మండలాల్లోనే
- ప్రాథమికంగా అంచనా వేసిన వ్యవసాయాధికారులు

# మొంథా తుఫాను దెబ్బ..!


మొగిలిగిద్దలో పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

వర్షానికి దెబ్బతిన్న పంటలు (ఎకరాల్లో)

| మండలం | దెబ్బతిన్న పంట విస్తీర్ణం | రైతులు |
|---|---|---|
| యాచారం | 165 | 85 |
| కందుకూరు | **20** | **07** |
| మాడ్గుల | 10 | 04 |
| కేశంపేట్ | **153** | **123** |
| బాలాపూర్ | 06 | 02 |
| ఆమనగల్లు | **06** | **08** |
| మంచాల | 25 | 16 |
| ఫరూక్‌నగర్ | **28** | **16** |
| ఇబ్రహీంపట్నం | 50 | 50 |
| తలకొండపల్లి | **12** | **04** |

రంగారెడ్డి, మేజర్ న్యూస్ (అక్టోబర్ 30) : జిల్లాలో నీటి వసతి ఉన్న చాల మంది రైతులు వరి పంట సాగు చేశారు. ప్రస్తుతం ఆ వరి పంట కొన్ని చోట్ల ఎన్ను దశలో ఉండగా మరికొన్ని చోట్ల కోత దశకు చేరుకుంది. మరికొన్ని రోజుల్లో కోతలు ప్రారంభించాలనుకున్న తరుణంలో వర్షం అన్నదాతలను మొంథా తుపాను దెబ్బతీసింది. ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలతో రైతుల కష్టమంతా వర్షార్పణమైంది.

మిగతా 2లో


అనంతగిరిలో భారీ హనుమాన్ విగ్రహం.


అనంతగిరి దేవాలయం.



నేటి నుంచి అనంతపద్మనాభుడి కార్తీకమాస

# పెద్ద జాతర

- నవంబర్ 5న స్వామివారి కళ్యాణం రథోత్సవం
- నవంబర్ 14న చక్ర తీర్థంతో ముగియనున్న స్వామి వారి ఉత్సవాలు
- ఏర్పాట్లు పూర్తిచేసిన నిర్వాహకులు అధికారులు

వికారాబాద్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్ (అక్టోబర్ 30): వికారాబాద్ జిల్లాలో పవిత్ర పుణ్యక్షేత్రమైన అనంత గిరి అనంతపద్మనాభ స్వామి ఆలయం కార్తీక మాస పెద్ద జాతరకు ముస్తాబైంది.

మిగతా 3లో

## కదిలిన అధికారులు..
# వరిపంట పొలాల పరిశీలన



బోడకొండలో నేలవాలిన వరి చేలను పరిశీలిస్తున్న ఏఈవో లింగస్వామి, రైతులు

# కలప అక్రమ రవాణా
చూసి చూడనట్లు వ్యవహరిస్తున్న ఫారెస్ట్ అధికారులు



# మహేశ్వరంలో రక్తదాన శిబిరం

మహేశ్వరం, మేజర్‌న్యూస్(అక్టోబర్ 30): పోలీసుల అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా మహా రక్తదాన శిభిరం నిర్వహించారు. గురువారం మండల కేంద్రం శివగంగ దేవాలయం ఆవరణలో సీపీ ఆదేశాల మేరకు మహేశ్వరం డీసీపీ సునితారెడ్డి ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ బ్రాంచ్ వారి సమక్షంలో రక్తదాన శిభిరాన్ని డీసీపీ ప్రారంభించారు. నాలుగు పోలీస్‌స్టేషన్‌ల సీఐలు,ఎస్ఐలు సిబ్బంది, వివిధ గ్రామాలనుండి తరలివచ్చిన యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.ఇట్టి శిభిరంలో మూడువందల వరకు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఏసీపీ జానకిరెడ్డి, సీఐలు,ఎస్ఐలు, వివిధ గ్రామాలనుండి తరలి వచ్చిన ప్రజలు పాల్గొన్నారు.



# మొంథా తుఫాను దెబ్బ..!



యాచారం మండలంలో నీట మునిగిన వరి పంట

రంగారెడ్డి, మేజర్ న్యూస్ (అక్టోబర్ 30) : జిల్లాలో నీటి వసతి ఉన్న చాల మంది రైతులు వరి పంట సాగు చేశారు. ప్రస్తుతం ఆ వరి పంట కొన్ని చోట్ల ఎన్ను దశలో ఉండగా మరికొన్ని చోట్ల కోత దశకు చేరుకుంది. మరికొన్ని రోజుల్లో కోతలు ప్రారంభించాలనుకున్న తరుణంలో వర్షం అన్నదాతలను మొంథా తుపాను దెబ్బతీసింది. ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలతో రైతుల కష్టమంతా వర్షార్పణమైంది. చేతికొచ్చిన పంట నేలపాలు కాగా.. సాగు ఖర్చు నీళ్లపాలైంది. జిల్లాలో చాల చోట్ల వర్షం ధాటికి వరి పంట నీట మునగగా.. పలు చోట్ల నేల వాలింది. జిల్లాలోని పది మండలాలు, 48 గ్రామాల్లో వ్యవసాయాధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి నీట మునిగి దెబ్బతిన్న పంటలను గుర్తించారు. ఇంకా గుర్తించే పనిలో ఉన్నారు. ప్రాథమిక అంచన ప్రకారం జిల్లాలో 475 ఎకరాల్లో 315 మంది రైతులకు చెందిన వరి, పత్తి పంటకు నష్టం వాటిల్లింది. అందులో 466 ఎకరాల్లో అత్యధికంగా వరి దెబ్బతిన్నట్లు, 12 ఎకరాల్లో పత్తి పాడైనట్లు గుర్తించారు. అత్యధికంగా యాచారం మండలంలో 165 ఎకరాల్లో 85 మంది రైతులు వరి, పత్తి, కేశంపేట్‌లో 153 ఎరాల్లో 123 మంది రైతుల పత్తి, వరి పంటలను నష్టపోయారు. యాచారం, కేశంపేట, మాడ్గుల, బాలాపూర్, ఆమనగల్లు, మంచాల, ఇబ్రహీంపట్నం, తలకొండపల్లి మండలాల్లో వ్యవసాయాధికారులు నష్టపోయిన పంటలను పరిశీలించారు. అలాగే షాద్‌నగర్ నియోజకవర్గం ఫరూక్‌నగర్ మండలం మొగిలిగిద్ద గ్రామంలో వ్యవసాయాధికారులు పర్యటించారు. జిల్లా వ్యవసాయ అధికారి ఉష స్థానిక అధికారులు నిశాంత్‌కుమార్, తేజ్‌కుమార్‌తో కలిసి వరి పంటను క్షేత్ర స్థాయిలో పరిశీలించించారు. రైతులతో మాట్లాడారు. 33 శాతం కంటే ఎక్కువ పంట నష్టం జరిగితే ఏఈవోల ద్వారా నివేధిక ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో పంట నష్టంపై అధికారులు సర్వేను కొనసాగిస్తున్నారు. పరిహారం కోసం ప్రభుత్వానికి నివేదిక పంపనున్నారు.



కేశంపేట మండలంలో వర్షం తాకిడికి నేలకొరిగిన వరి



'వరి'పై తుపాను దెబ్బ..

మొంథా తుపాను ప్రభావం జిల్లాలో అధికంగా వరిపై పడింది. పంట చేతికి వచ్చే దశలో తుపాను వరి రైతులను ముంచేసింది. 311 మంది రైతులు 466 ఎకరాల్లో వరి పంట నష్టపోయారు. అత్యధికంగా యాచారం మండలంలోని 5 గ్రామాల్లో 85 మంది రైతులు 165 ఎరాలు నష్టపోగా కేశంపేట మండలంలోని 12 గ్రామాల్లో 122 మంది రైతులు 151 ఎకరాల్లో పంటను నష్టపోయారు. అలాగే కందుకూరు మండలంలోని రెండు గ్రామాల్లో ఏడుగురు రైతులు 20 ఎకరాలు, మాడ్గుల మండలంలోని నాలుగు గ్రామాల్లో ముగ్గురు రైతులు ఐదెకరాలు, బాలాపూర్‌లో ఇద్దరు రైతులు ఆరెకరాలు, ఆమనగల్లు మండలంలోని నాలుగు గ్రామాల్లో 8 మంది రైతులు 6 ఎకరాల్లో వరి పంటను నష్టపోయారు. అలాగే మంచాల మండలంలోని 5 గ్రామాల్లో 16 మంది రైతులు 25 ఎకరాలు, ఫరూక్‌నగర్ మండలంలోని ఐదు గ్రామాల్లో 14 మంది రైతులు 26 ఎకరాలు, తలకొండపల్లి మండలంలోని రెండు గ్రామాల్లో నలుగురు రైతులు 12 ఎకరాల్లో వరి పంటను కోల్పోయారు. ఫరూక్‌నగర్, మాడ్గుల మండలంలో పాడైన పత్తి జిల్లాలోని ఫరూక్‌నగర్, మాడ్గుల మండలాల్లో ఆరు మండలాల్లో 12 ఎకరాల్లో పత్తి పంట నీట మునిగింది. చేతికి వచ్చిన దశలోనే వర్షం దెబ్బతీయడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. వర్షం కారణంగా పత్తి నల్లబారుతోంది. నీట మునిగిన పత్తి పంట అత్యధికంగా మాడ్గుల మండలంలో నలుగురు రైతులు 10 ఎకరాల్లో, ఫరూక్‌నగర్ మండలంలో ఇరువురు రైతులు రెండెకరాల్లో పత్తి పంట నీట మునిగింది. నీట మునిగిన పత్తి పంటను వ్యవసాయాధికారులు పరిశీలించారు.

భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న ప్రాంతాల్లో సహాయ, పునరావాస

# చర్యలు చేపట్టాలి

ఐటీ, పరిశ్రమల శాఖ, జిల్లా ఇంచార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



రంగారెడ్డి, మేజర్ న్యూస్ (అక్టోబర్ 30) : భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న ప్రాంతాల్లో సహాయ, పునరావాస చర్యలు చేపట్టాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఉమ్మడి రంగారెడ్డి అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. గురువారం రాత్రి జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ, వాటర్ బోర్డు, ఆర్ అండ్‌బి, విద్యుత్, మున్సిపల్ కమి షనర్లతో మాట్లా డారు. వరద నీరు ప్రవేశించిన లోతట్టు కాలనీలు, గ్రామాలను మ్యాపింగ్ చేసి మరోసారి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దెబ్బతిన్న రోడ్డు, కల్వర్టులకు తక్షణ మరమ్మత్తులు చేపట్టాలన్నారు. తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగే ప్రాంతాల్లో శాశ్వత ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని సూచించారు. వరదల వల్ల నష్టపోయిన ప్రజలకు తక్షణ సాయం అందించడంతో పాటు నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదికలు పంపించాలన్నారు. అధికారులు స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి కూరగాయల తోటలు, వరి పొలాల పంట నష్టం అంచనాలు రూపొందించాలని ఆదేశించారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా రహదారుల మరమ్మత్తులు చేపట్టి రవాణా సౌకర్యాన్ని పునరుద్ధరించాలన్నారు. జిల్లా కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకుని ఎక్కడ అవాంతరాలు లేకుండా పనులు జరిగేలా చూడాలని ఆయన సూచించారు.

## ప్రజలకు సులభమైన బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి... ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

- "బడంగ్‌పేట్‌లో పోచంపల్లి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ నూతన బ్రాంచ్ ప్రారంభం"
- "ప్రాంతీయ ఆర్థిక కార్యకలాపాలకు ఊతమిస్తుందని వ్యాఖ్యానం"



బాలాపూర్, మేజర్ న్యూస్ (అక్టోబర్ 30):మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బడంగ్‌పేట్ పాత గ్రామ పంచాయతీ సర్కిల్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన పోచంపల్లి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ నూతన బ్రాంచ్‌ను మాజీ మంత్రివర్యులు, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి చేతుల మీదగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ...స్థానిక ప్రజలకు ఆర్థిక సేవలు మరింత చేరువ కావడం ఆనందదాయకమని తెలిపారు. బ్యాంక్ విస్తరణతో చిన్న వ్యాపారులు, మహిళా సంఘాలు, ఉద్యోగులు లాంటి వర్గాలకు సులభంగా రుణాలు, సేవింగ్స్ సదుపాయాలు లభిస్తాయినీ అన్నారు. ఇది ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తుంది అని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు రామిడి రామిరెడ్డి, మాజీ కార్పొరేటర్లు సూర్ణగంటి అర్జున్, పెద్దబావి ఆనందరెడ్డి, ఏనుగు రామిరెడ్డి, పెద్దబావి శ్రీనివాస్ రెడ్డి, పుట్టగళ్ళ సంతోష్ కుమార్, పెద్దబావి మహేందర్ రెడ్డి, కర్రె బల్వంత్, మీర్ పేట్ బి ఆర్ఎస్ అర్కల కామేష్ రెడ్డి, పోచంపల్లి బ్యాంక్ చైర్మన్, మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి బ్యాంకు అధికారులను అభినందిస్తూ, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా సేవలు అందించాలని ఆమె సూచించారు.



## కదిలిన అధికారులు.. వరిపంట పొలాల పరిశీలన




నోములలలో పంట పొలాలను పరిశీలిస్తున్న ఎఈవో సాయి సిరి, తదితరులు



### రైతులను కలవర పెడుతున్న వర్షాలు

- కంటి మీద కునుకు లేకుండా చేస్తున్న మరో అల్పపీడనం
- వద్దంటే.. దంచి కొడుతున్న వానలు
- చాపల పరుచుకుంటున్న వరి చేలు
- ఆవిరవుతున్న అన్నదాత ఆశలు

మంచాల, మేజర్ న్యూస్ (అక్టోబర్ 29) : అకాల వర్షాలు రైతులను కలవర పెడుతున్నాయి. తీరా వరి పంటలు చేతికొచ్చే సమయంలో వర్షాలు కురవడంతో రైతులు నష్టపోతున్నారు. ఈ వానాకాలంలో సాగు చేసిన వరి పంటలు కోత దశకు వచ్చాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల వలన రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. భారీ వర్షాలు కురిస్తే వరి చేలు నేల వాలిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే మండలంలోని పలు గ్రామాల్లో వరి చేలు ఎత్తు పెరిగి నేల వాలి పడిపోయినట్లు రైతులు తెలుపుతున్నారు. ప్రతి ఏటా గాలి వానలు రైతాంగానికి శాపంగా మారుతున్నాయి. నేలవాలిన వరి చేలు కోయలేని పరిస్థితి ఎదురౌతుంది. ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి సాగుచేసిన వరి, పత్తి చేలు అకాల వర్షానికి నేల వాలడంతో అన్నదాత ఆశలు ఆవిరవుతున్నాయి. మండలంలోని ఆరుట్ల, బోడకొండ, బండలేమూర్, చెన్నారెడ్డి గూడ తదితర గ్రామాల పరిధిలో సుమారు 90 ఎకరాలకు పైగా వరి, పత్తి, కూరగాయల పంటలు దెబ్బతిన్నట్లు ప్రాథమిక సమాచారం. చేతికొచ్చిన పంటలు అకాల వర్షాలకు దెబ్బతినడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పెట్టుబడులు కూడా వెళ్లే పరిస్థితి లేదని కొందరు రైతులు వాపోతున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పంట నష్టపోయిన రైతులను గుర్తించి ఆదుకోవాలని కోరుతున్నారు.

మూడు ఎకరాల వరి పంట నేల వాలింది.
మూడు ఎకరాలు కౌలుకు తీసుకొని వరి సాగు చేశా. సుమారు 80 వేల పెట్టుబడి పెట్టాను. చేతికొచ్చిన వరి పంట మొత్తం నేల వాలింది. పెట్టుబడి కూడా వెళ్లడం కష్టంగా ఉంది.
- కసరమోని బాలయ్య రైతు, నోముల

వరద నీటిని తొలగించాలి
రైతులు ఆందోళన చెందొద్దు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వరి చేలల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలి. పంట పొలాల్లో పిలకలు తీసుకొని నీరు బయటకి వెళ్లేలా జాగ్రత్తలు తీసుకోవాలి. నేల వాలిన వరి పిలకలను కట్టలు కట్టుకోవాలి.
- జి. వెంకటేష్, మండల వ్యవసాయ అధికారి, మంచాల

సూర్య దినపత్రికలో ప్రచురితమైన కథనం

మంచాల, మేజర్ న్యూస్ (అక్టోబర్ 30) : 'రైతులను కలవర పెడుతున్న వర్షాలు' అని సూర్య దినపత్రికలో బుధవారం ప్రచురితమైన కథనానికి వ్యవసాయ అధికారులు స్పందించారు. మండలంలోని చిత్తాపూర్, నోముల, మంచాల, బోడ కొండ, ఎల్లమ్మ తండా, దాద్‌పల్లి గ్రామాలలో దెబ్బతిన్న వరి పంట పొలాలను గురువారం వ్యవసాయ అధికారులు పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. మూడు రోజుల పాటు వ్యవసాయ పనులు వాయిదా వేయాలని రైతులకు సూచించారు. నేల వాలిన వరి పిలకలను పైకి లేపి కట్టలు కట్టుకోవాలని సూచించారు. పంట చేలలో వరద నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. మండలంలో 25 ఎకరాలలో పంట నష్టం జరిగినట్లు గుర్తించామని తెలిపారు. పంట నష్టం నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పారు. ఈ క్షేత్ర సందర్శనలో ఏఈవోలు సాయి సిరి, లింగస్వామి, రైతులు లక్ష్మణ్, చాంది, బాలాజీ దాస్, సంజీవ రెడ్డి తదితరులు ఉన్నారు.

# నేటి నుంచి అనంతపద్మనాభుడి
# కార్తీకమాస పెద్ద జాతర

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్ (అక్టోబర్ 30):**
వికారాబాద్ జిల్లాలో పవిత్ర పుణ్యక్షేత్రమైన అనంత గిరి అనంతపద్మనాభ స్వామి ఆలయం కార్తీక మాస పెద్ద జాతరకు ముస్తాబైంది. నేటి నుంచి ప్రారంభమయ్యే జాతర 15 రోజుల పాటు కనులపండుగగా జరగనుంది. ఉత్సవాలకు సమీప ప్రాంతాల నుంచే కాకుండా హైదరాబాద్, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల భక్తులు తరలొచ్చి స్వామి వారిని దర్శించుకుంటారు. జాతరకు సంబంధించి భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాన్ని ముస్తాబు చేశారు. విద్యుత్ లైట్లతో ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. ధ్వజారోహణంతో ఉత్సవాల ప్రారంభం నేడు సాయంత్రం ఉత్సవాలను ధ్వజారోహనంతో అర్చకులు ప్రారంభిస్తారు. వచ్చే నెల 2న కార్తీక ఏకాదశి ఉత్సవం, 3న రాత్రి తులసి వివాహం నిర్వహిస్తారు. 5న కార్తీక పౌర్ణమి సందర్భంగా స్వామి వారి కల్యాణం, రథోత్సవాలను నిర్వహిస్తారు. 14న ఉదయం 11గంటలకు ఆలయ పుష్కరిణిలో చక్రతీర్థంతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ అధికారులు, అర్చకులు వివరించారు.

**★ఆలయ చరిత్ర...**
అనంతపద్మనాభ స్వామి ఆలయం ద్వాపరయుగం నాటిదని, ఐదు వేల సంవత్సరాల చరిత్ర కలదని స్థల పురాణం చెబుతోంది. స్వామి దర్శనం కోసం మార్కండేయ మహర్షి తపస్సు చేశాడని, దానికి మెచ్చి భగవంతుడు శ్రీకృష్ణుని అవతారంలో మహర్షికి దర్శనమిచ్చాడని ప్రతీతి. అనంత పద్మనాభుడిగా సాలగ్రామ శిలారూపంలో కూర్చున్నట్లుగా స్కంద పురాణాన్ని బట్టి తెలుస్తోంది. పూర్వం అనంతగిరి నుంచి కాశీ వరకు గుహ ఉండేదని, దాని నుంచే మార్కండేయుడు కాశీకి వెళ్ళి విశ్వనాథుడిని దర్శించుకొని గంగాజలం తెచ్చి ఇక్కడి స్వామికి అభిషేకం చేసేవాడనిఅంటారు. కలియుగంలో ఆషాఢ శుద్ధ ఏకాదశి రోజున స్వామి వారిని అర్థిస్తే గంగామాత అనంతగిరి క్షేత్రానికొచ్చి పుష్కరిణిగా మారిందని ప్రశస్తి. ఇందులో స్నాన మాచరిస్తే గంగాస్నానఫలం దక్కుతుందని పురాణం చెబుతుంది. కార్తీకంలో ఎవరైతే సాలగ్రామ దర్శనం చేసుకుంటే పాప పరిహారం, కోటి కన్యాదాన ఫలం సిద్ధిస్తాయని అర్చకులు పేర్కొన్నారు.

**భద్రతను కట్టుదిట్టం చేస్తాం**
**: వికారాబాద్ టౌన్ సీఐ భీమ్ కుమార్**



అనంతగిరిలో నేటి నుంచి జరిగే కార్తీక మాస పెద్ద జాతర ఉత్సవాలకు కట్టదిట్టమైన భద్రతను ఏర్పాటు చేస్తున్నాం. జాతర సందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే టెంపుల్ సమీపంలో పెట్రోల్ మొబైల్‌తో గస్తీ కాస్తున్నాం.

# కలప అక్రమ రవాణా

**చూసి చూడనట్లు వ్యవహరిస్తున్న ఫారెస్ట్ అధికారులు**



**దౌల్తాబాద్, మేజర్ న్యూస్ (అక్టోబర్ 30) :** మండలంలోని గుండాల్ బాలంపేట్,సుల్తాన్ పూర్,ఈర్లపల్లి, చెల్లాపూర్,గోక ఫసల్వాద్,తిమ్మారెడ్డి పల్లి,యంకి, తదితర గ్రామాల నుండి నిత్యం కలప అక్రమ రవాణా జరుగుతున్న ఫారెస్ట్ అధికారులు మాత్రం చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ప్రతి రోజు లారీలలో మరియు ట్రాక్టర్లలో కలపను పదుల సంఖ్యలో వెళ్తున్నా అధికారులు మాత్రం మొద్దు నిద్రలో ఉన్నారని అన్నారు. అదే విదంగా వ్యాపారులు మూడు పువ్వులు ఆరు కాయలుగా కట్టెల వ్యాపారం దర్జాగా సాగిస్తూ వాల్టా,,చట్టాన్ని తుంగలో తొక్కి ధనార్జనే ధ్యేయం గా కలపను రాత్రికి రాత్రే లారీల్లో ట్రాక్టర్లలో నల్ల కవర్ కప్పుకొని వెళుతున్నారు అని తెలిపారు. కొందరు అక్రమార్కులకు నిత్యం ఇదే పనిగా రెచ్చిపోతున్న పట్టించుకునే నాధుడే లేడు. తమ ఇష్టానుసారంగా కలప అక్రమార్కులకు అధికారులు పర్మిషన్ ఇచ్చి నడుపుతురంటే ఇంతకన్నా ఘోరం ఏదైనా ఉందా కాబట్టి ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కలపను అక్రమ రవాణా కాకుండా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

# పేదల ఆరోగ్యం భరోసా...

- **సీఎం రిలీఫ్ ఫండ్‌తో ఊరట**
- **పర్వీన్ బేగంకు రూ.29 వేల చెక్కు**

**అందజేసిన ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి**



**కీసర మేజర్,న్యూస్ (అక్టోబర్,30):**
కీసర మండలం గోధుమకుంట గ్రామానికి చెందిన పర్వీన్ బేగం (భర్త పాషా బేగ్) వైద్య చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ. 29 వేల చెక్కును మేడ్చల్ నియోజకవర్గ శాసనసభ్యులు, మాజీ మంత్రివర్యులు చామకూర మల్లారెడ్డి గురువారం బోయినపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద లబ్ధిదారికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ, పేద ప్రజల ఆరోగ్య అవసరాల కోసం సీఎం రిలీఫ్ ఫండ్ ఒక మద్దతుగా నిలుస్తోందని తెలిపారు.

వైద్య చికిత్స కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ఈ నిధి ఆశాకిరణంగా మారిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గోధుమకుంట గ్రామ మాజీ సర్పంచ్ ఆకిటి మహేందర్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు వంగేటి మహేందర్ రెడ్డి, లబ్ధిదారులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# పత్తి రైతులకు మద్దతు ధర కల్పించాలి...

**– కేవీపీఎస్ ప్రధాన కార్యదర్శి బక్కని రాజు**



వినతి పత్రం అందచేస్తున్న దృశ్యం

**పెద్దేముల్,మేజర్ న్యూస్ (అక్టోబర్ 30):**
పత్తి రైతులకు ప్రభుత్వం మద్దతు ధర కల్పించాలంటు గురువారం కేవీపీఎస్ పెద్దేముల్ మండల ప్రధాన కార్యదర్శి బక్కని రాజుతో పాటు పలువురు రైతులు వ్యవసాయ అధికారులకు వినతి పత్రం అందచేశారు. మొంథా తుఫాన్‌తో పాటు నెల రోజుల పాటు కురిసిన భారీ వర్షాలకు పత్తి పంటలు తడసి పాడవడంతో ప్రభుత్వం తేమ శాతం చుడకుండా నేరుగ పత్తి పంటలను కొనుగోలు చేయాలన్నారు. గత మూడేళ్ల నుండి రైతులు ఏదో ఓ విదంగా ఆతివృష్టి, అనావృష్టితో నష్టపోతున్నందున ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. సీసీఐ ద్వార ఖరీదు చేస్తున్న పత్తి పంటకు రైతులకు ఇబ్బందులు రాకుండా ప్రభుత్వం ఖరీదు చేయాలని కోరారు. వారితో పాటు పెద్దేముల్, నాగులపల్లి గ్రామాల రైతులు గోపాల్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# డివైడర్‌ను నుండి కొట్టిన బైక్....

- **ప్రమాదంలో వ్యక్తి మృతి, మరో వ్యక్తికి తీవ్ర గాయాలు**
- **జిల్లా ఆస్పత్రికి తరలింపు**
- **అంత్యక్రియలు**

**వెళ్లి వస్తుండగా ప్రమాదం**



**బషీరాబాద్, మేజర్ న్యూస్(అక్టోబర్ 30):** బైక్ అదుపు తప్పి డివైడర్ ను ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందగా మరో వ్యక్తికి తీవ్రగాయలైన సంఘటన బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... బషీరాబాద్ మండలం పరిధిలోని వల్య నాయక్ తండాకు చెందిన బాల్య నాయక్(52), నంద్యా నాయక్ తండా కు చెందిన తుల్చ నాయక్ ఇద్దరూ కలిసి కర్ణాటక ప్రాంతంలో అంత్యక్రియలకు వెళ్లి తిరిగి వస్తుండగా బషీరాబాద్ సమీపంలో వారు ప్రయాణిస్తున్న బైక్ అదుపు తప్పి డివైడర్ ను డీ కొట్టింది. ఈ ప్రమాదంలో బాల్య నాయక్ మృతి చెందగా,తుల్చ నాయక్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. తీవ్ర గాయాలు అయిన తుల్చ నాయక్ ను చికిత్స నిమిత్తం తాండూరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. మృతి చెందిన బాల్య నాయక్ మృతదేహాన్ని పోస్టుమార్టు నిమిత్తం తాండూరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. మద్యం మత్తులోనే ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నుమన్ అలీ తెలిపారు.

# హెడ్మాస్టర్ సైదిరెడ్డికి సన్మానం...



మణికొండ, మేజర్ న్యూస్ (అక్టోబర్ 30): మణికొండ మున్సిపల్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను హైదర్ షాకోట్ కాంప్లెక్స్ హెడ్మాస్టర్ సైదిరెడ్డి గురువారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా తన రిటైర్‌మెంట్ ఫంక్షన్‌కి ప్రతి ఒక్కరు రావాలని ఆహ్వాన పత్రికను పాఠశాల సిబ్బంది, గ్రామపెద్దలకు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ కౌన్సిలర్ రామక్రిష్ణారెడ్డి, హెడ్మాస్టర్ ధశరథ్ నాయక్ ఆయనను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

# జూబ్లిహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిదే ఘన విజయం

★ఎమ్మెల్యే కసిరెడ్డి, కాంగ్రెస్ నేతలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించినట్లు తెలిపిన మాడ్గుల మండల మాజీ కోఆప్షన్ సభ్యులు, విజయడైరీ చైర్మన్‌లు



మాడ్గుల, మేజర్‌న్యూస్ (అక్టోబర్ 30): ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సారధ్యంలోని కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం అన్నివర్గాల అభ్యున్నతిని కాంక్షించి అమలుచేస్తున్న సంక్షేమ , అభివృద్ధి పథకాలకు ప్రజలంతా బ్రహ్మరథం పడుతున్నారని మాడ్గుల మండల మాజీ కోఆప్షన్ సభ్యులు తుమ్మ జోజిరెడ్డి, మాడ్గుల విజయడైరీ చైర్మన్ బొజ్జ సాయిరెడ్డిలు తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలతో జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి వి. నవీన్‌యాదవ్ భారీ మెజార్టీతో ఘన విజయం సాధించడం ఖాయమని వారు ధీమా వ్యక్తం చేశారు. ఈమేరకు గురువారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేతలు సూధిని కొండల్‌రెడ్డి, సూధిని శ్రీనివాస్‌రెడ్డి, కల్వకుర్తి నియోజకవర్గంలోని వివిధ మండలాల కాంగ్రెస్ శ్రేణులతో కలిసి జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్లు జోజిరెడ్డి, సాయిరెడ్డిలు తెలిపారు. ఈ సందర్భంగా జూబ్లిహిల్స్ అసెంబ్లి సెగ్మెంట్‌లోని ఏ కాలనీకి వెళ్ళినా ప్రజలంతా ముక్తకంఠంతో కాంగ్రెస్‌కు మద్ధతు పలుకుతున్నట్లు చెప్పారు. గత పాలకులు ప్రజాసమస్యలు గాలికొదిలి కుటుంబ సంక్షేమానికి పెద్దపీట వేయడంతోనే ప్రజలు కాంగ్రెస్‌ను ఆధరిస్తున్నట్లు తెలిపారు. నవంబర్ 11న జరిగే జూబ్లిహిల్స్ ఉప ఎన్నిక పోలింగ్‌లో అక్కడి ప్రజలంతా కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌కు ఓటువేస్తామని బాహాటంగానే తెలుపుతున్నట్లు జోజిరెడ్డి, సాయిరెడ్డిలు పేర్కొన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో అందుగుల సింగిల్‌విండో డైరెక్టర్ కొప్పుల జగన్‌గౌడ్, ఏఎమ్‌సి డైరెక్టర్ జెల్ల రమేష్‌గౌడ్, బ్రాహ్మణపల్లి మాజీ సర్పంచ్ బొమ్ము మంగమ్మనాగయ్య, నియోజకవర్గంలోని వివిధ మండలాల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారని మాజీ కోఆప్షన్ సభ్యులు తుమ్మ జోజిరెడ్డి, మాడ్గుల విజయడైరీ చైర్మన్ బొజ్జ సాయిరెడ్డిలు తెలిపారు.



# గత ప్రభుత్వం చేసిన తప్పే ఈ ప్రభుత్వం చేస్తుంది

▶▶ ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్

▶▶ షాద్‌నగర్‌లో బంద్ విజయవంతం




షాద్‌నగర్, మేజర్‌న్యూస్ (అక్టోబరు 30) : విద్యార్థుల విషయంలో గతంలో పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పే ప్రస్తుత ం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందని ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు వద్ల శ్రీకాంత్ విమర్శించారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు షాద్‌నగర్‌లో గురువారం నిర్వహించిన కళాశాలల బంద్ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. స్వచ్ఛందంగా కళాశాలల విద్యార్థులు ఈ బంద్ కార్యక్రమంలో పాల్గొని తమ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యార్థులకు సమారుగా పెండింగ్‌లో ఉన్న సుమారు రూ. 8500 కోట్ల స్కాలర్‌షిప్ ఫీజు బకాయిలను విడుదల చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేయడం విడ్డూరమన్నారు. గతంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం పెండింగ్ బకాయిలు విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో ఆటలాడిందన్నారు. అందుకు విద్యార్థులంతా ఏకమై బీఆర్ఎస్‌ను అధికారానికి దూరం చేసిన విషయం గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం సహితం విద్యార్థులపై చిన్నచూపు చూస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని కేటాయించలేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కళ్ళు తెరచి విద్యార్థుల సమస్య పరిష్కరించకుండా ఇలాగే వ్యవహరిస్తే బీఆర్ఎస్ కు పట్టిన గతే కాంగ్రెస్ ప్రభుత్వానికి పడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శివశంకర్, చరణ్, చింటూ, వంశీచంద్ర, కార్తిక్, అమీర్‌బాబా, బబ్లూ, సాయి, విజయ్, హరి, నవదీప్, శివ తదితరులు పాల్గొన్నారు.

# స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే చెల్లించాలి



చేవెళ్ల, మేజర్‌న్యూస్ (అక్టోబర్ 30): చేవెళ్ల, మొయినాబాద్ మండలాల్లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మొయినాబాద్ మండలంలో విద్యాసంస్థ బంద్ నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ నాయకులను కేజీ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యంతో పోలీసులు కుమ్మక్కై అత్యుత్సాహం ప్రదర్శించి ఎస్ఎఫ్ఐ నాయకులను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈసందర్భంగా ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎర్రవల్లి శ్రీనివాస్, బేగరి అరుణ్‌కుమార్‌లు మాట్లాడుతూ.... కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకుండా వారి జీవితాలతో ఆడుకుంటుందన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ. 8500కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ జూనియర్, డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మసీ, బీఎడ్ తదితర విద్యాసంస్థల బంద్‌కు పిలుపు నిచ్చిందన్నారు. పిలుపులో భాగంగా బంద్ నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులను పోలీసులు అడ్డుకుని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించడం సరైంది కాదని మండిపడ్డారు. పోలీస్ నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరన్నారు. విద్యార్థి ఉద్యమాల ద్వారానే తెలంగాణ రాష్ట్రం వచ్చిందన్నారు. విద్యార్థి ఉద్యమాలను చూసి రాష్ట్ర ప్రభుత్వం భయపడుతుందన్నారు. వెంటనే పెండింగ్‌లో స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని, లేనిపక్షంలో ఆందోళన పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ చేవెళ్ల మండల కార్యదర్శి మాల చందు, ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ నాయకులు రిషి, ఆకాష్, విష్ణు, కైఫ్, వినయ్, లోకేష్ తదితరులు ఉన్నారు.



# పీఏసీఎస్ కార్యదర్శి యాదగిరిరెడ్డి బదిలీ

## ఇంచార్జీ కార్యదర్శిగా కాలే మహేష్



కందుకూరు, మేజర్‌న్యూస్(అక్టోబర్ 30): దశాబ్ద కాలంగా కందుకూరు ప్రాథమిక వ్యవసాయ సహాకార సంఘంలో విధులు నిర్వహించిన కార్యదర్శి నిమ్మ యాదగిరిరెడ్డి బదిలీ అయ్యారు. గురువారం పీఏసీఎస్‌లో పీఐసీ చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి ఆధ్వర్యంలో యాదగిరిరెడ్డిని ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు.ఇంచార్జీ కార్యదర్శిగా రెగ్యులర్ స్టాప్ కాలే మహేష్‌ను బాధ్యతలు అప్పగించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రామచంద్రారెడ్డి,బొర్ర రాములు,టంకరి హన్మంత్‌రెడ్డి జంగయ్య,సిబ్బంది,రైతులు పాల్గొన్నారు.

# పేదింట్లో పెళ్లికి బీఆర్ఎస్ నాయకుల ఆర్థిక సహాయం



కేశంపేట, మేజర్‌న్యూస్ (అక్టోబర్ 30): కేశంపేట మండలం తొమ్మిదిరేకుల గ్రామానికి చెందిన నిరుపేద ఇంట్లో అమ్మాయి పెళ్లికి బీఆర్ఎస్ నాయకులు ఆర్థిక సహాయం అందజేశారు. గ్రామానికి చెందిన కటికె ఇషబాబు-ఈశ్వరబాయి కూతురు పెళ్లి నిశ్చయమైంది. వారి ఆర్థిక పరిస్థితి బాగా లేక పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్న మాజీ మార్కెట్ కమిటి వైస్‌చైర్మెన్ వి. లక్ష్మీనారాయణగౌడ్ రూ. 5 వేలు, గ్రామ బీఆర్ఎస్ నాయకులు అందరు రూ. 7 వేలు మొత్తం 12 వేలు కటికె ఇషబాబు-ఈశ్వరబాయిలకు అందజేశారు. ఆర్థిక సహాయం అందజేసిన బీఆర్ఎస్ నాయకులకు కుటంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బాల్‌రాజుగౌడ్, రాంరెడ్డి, గోస్కె నర్సింలు, అంజనేయులు, నాగిళ్ల బాలయ్య, యాదగిరి, బాలయ్య, లక్ష్మయ్య, నర్సింలు, చెంద్రయ్య, శ్రీనివాస్‌గౌడ్, జానానాయక్, హనుమంతు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# పోలాల్లో నిలిచిపోయిన వర్షపు నీటిని తొలగించాలి

## -ఇంఛార్జి వ్యవసాయాధికారి రాజేందర్‌రెడ్డి



కొందుర్గు, మేజర్‌న్యూస్(అక్టోబర్ 30): మొంథా తూఫాన్ ప్రభావంతో పంటపోలాల్లో నిలిచిన వర్షపు నీటిని రైతులు అంతర్గత కాలువల ద్వారా తొలగించాలని కొందుర్గు మండల ఇంఛార్జి వ్యవసాయాధికారి రాజేందర్‌రెడ్డి సూచించారు. వర్షానికి నేలకు వరిగిన చెనును పైకి లేపి కట్టుకోవాలని, అలాగే నిలబడి ఉన్న లేదా పడిపోయిన చేలల్లో గింజలు రంగు మారకుండా ఉండేందుకు, మానిపండు తెగులు నివారణ కోసం ఎకరాకు 200ఎంఎల్ ప్రోపికోనజోల్ పిచికారి చేయాలని సూచించారు. నిరంతర వర్షాల వల్ల గింజ పట్టే దశలో వరి గింజలోని ద్రావస్థ తొలిగి నిలబడి, పడిపోయిన చేలల్లో మొలక వచ్చే అవకాశం ఉందని, కోత దశలో నిలిచిన లేదా పడిపోయిన కంకిలో మొలకలు కనబడితే నీరు బయటకు తీసివేసిన తరువాత ఐదు శాతం ఉప్పు ద్రావణం లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు. ఇలా చేయడం వల్ల మొలకెత్తడాన్ని, రంగు మారడాన్ని నివారిస్తుందని వ్యవసాయాధికారి రాజేందర్‌రెడ్డి వివరించారు.

# దందాలు పక్కన పెట్టి ప్రజా సమస్యలపై దృష్టి పెట్టండి

● రైతు, విద్యార్థి, పేద ప్రజల బాధలు గుర్తించండి ● ఈటల రాజేందర్ హెచ్చరిక ● కేసీఆర్ తోవలోనే రేవంత్ పయనం: ఈటల ఫైర్



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్ (అక్టోబర్, 30):**

"ముఖ్యమంత్రి గారు! మీ దందాలు, వసూళ్లు పక్కన పెట్టి ప్రజల గురించి పట్టించుకోండి. ఈ అధికారం శాశ్వతం కాదు. నేల మీదకు దిగివచ్చి ప్రజా సమస్యలను పరిష్కరించండి," అంటూ బీజేపీ మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై విరుచుకుపడ్డారు. గురువారం ఆయన శామీర్‌పేట్‌లోని తన నివాసంలో మీడియా సమావేశం నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వ వైఖరిపై తీవ్ర విమర్శలు గుప్పించారు.

**తుఫాన్ నష్టంపై ఈటల ఆవేదన:**

"తుఫాన్ వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారు. 35 శాతం అధిక వర్షపాతం నమోదై, పత్తి, మక్క, వరి పంటలు పూర్తిగా నాశనమయ్యాయి. పత్తి జాలు పట్టింది, వరి బూజు పట్టింది, కోత కోసి పెట్టిన పంట నీటిలో కొట్టుకుపోయింది. చేతికి రావాల్సిన పంట నీళ్లపాలైంది," అని ఈటల ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి రైతులతో మాట్లాడి సహాయక చర్యలు చేపడుతుంటే, తెలంగాణ ప్రభుత్వం మాత్రం "నిమ్మకు నీరెత్తినట్లు" ప్రవర్తిస్తోందని ఆయన విమర్శించారు. ఉమ్మడి కరీంనగర్, వరంగల్, మహబూబ్ నగర్ జిల్లాల్లో లక్షల ఎకరాల పంట అక్కరకు రాకుండా పోయిందని వివరించారు. "భీమదేవరపల్లి మండలంలో 41 సెంటీమీటర్ల వర్షం కురిసింది. వరంగల్ సగం పట్టణం 6 అడుగుల నీటిలో మునిగిపోయింది. రైతులు ఏడుస్తున్నారు. గ్రామాల్లో విషాదం నెలకొంది," అని పేర్కొన్నారు.

**రైతులను వెంటనే ఆదుకోండి :**

"పంట, ఇళ్ల నష్టాన్ని వెంటనే అంచనా వేయాలి. రైతులను ఓదార్చి ఆర్థిక సాయం అందించాలి. ఇళ్లలో ఉన్న సామాను కూడా కొట్టుకుపోయిన వారికి సహాయం చేయాలి. అన్ని పార్టీలు జూబ్లీహిల్స్ ఎన్నికలు పక్కన పెట్టి సహాయక చర్యల్లో పాల్గొనాలి," అని ఈటల విజ్ఞప్తి చేశారు.

**ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు వెంటనే చెల్లించండి :**

విద్యార్థుల సమస్యలపై కూడా ఈటల ఘాటు వ్యాఖ్యలు చేశారు. "బీఆర్ఎస్ రెండు సంవత్సరాలు ఇవ్వలేదు. ఇప్పుడు వీళ్లు కూడా రెండేళ్లుగా ఇవ్వడం లేదు. పది వేల కోట్ల రూపాయలు బకాయిగా ఉన్నాయి. కళాశాల యాజమాన్యాలు విద్యార్థుల దగ్గర వసూలు చేస్తున్నారు. డబ్బులు కట్టలేని పేద విద్యార్థులు చదువులు ఆపాల్సిన పరిస్థితి వచ్చింది. ప్రభుత్వం బడా కాంట్రాక్టర్లకు వేల కోట్లు ఇస్తోంది కానీ పేద విద్యార్థుల ఫీజులకు మాత్రం ఇవ్వడం లేదు. విజిలెన్స్ దాడులతో బెదిరించడం సరికాదు. వెంటనే బకాయిలు చెల్లించాలి," అని డిమాండ్ చేశారు.

**గ్రామాల్లో బకాయిలతో సర్పంచుల ఆత్మహత్యలు:**

గ్రామ పంచాయతీల్లో పనులు చేసిన సర్పంచులు, వార్డు సభ్యులు బిల్లులు రాక అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఈటల తెలిపారు. "దసరాకు చెల్లిస్తామని మాట ఇచ్చి ఇప్పటికీ చెల్లించలేదు. ఇంత దరిద్రమైన పరిస్థితి తెలంగాణలో ఎప్పుడూ రాలేదు," అని అన్నారు.

"మంత్రుల మధ్య వైరుధ్యాలు, పంపకాలు, దందాలు, కొట్లాటలతోనే ప్రభుత్వం నిమగ్నమై ఉంది. ప్రజా సమస్యలు ఎవరికి కనిపించడం లేదు," అని ఈటల విమర్శించారు. "ప్రజలు ఇప్పుడు మౌనంగా ఉన్నా, సమయం రాగానే బుద్ధి చెబుతారు. కేసీఆర్‌కి చేసినట్లే రేవంత్ రెడ్డికి కూడా చెబుతారు. ఈ అధికారం మీకు శాశ్వతం కాదు. ప్రజలు ఇచ్చింది దోచుకోవడానికి కాదు, సేవ చేయడానికి," అని హెచ్చరించారు.

ఈ సమావేశంలో మేడ్చల్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏనుగు సుదర్శన్ రెడ్డి, జిల్లా రూరల్ బీజేపీ అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్, నాయకులు అమరం మోహన్ రెడ్డి, బోడ శ్రీనివాస్, నియోజకవర్గంలోని వివిధ మండలాల బీజేపీ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కరణ్ కోట్ పోలీస్ స్టేషన్‌ను అకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ నారాయణ రెడ్డి...

## స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించిన ఎస్పీ




**తాండూర్ రూరల్ ,మేజర్ న్యూస్( అక్టోబర్ 30):** కరణ్ కోట్ పోలీస్ స్టేషన్ ను గురువారం జిల్లా ఎస్పీ కే. నారాయణరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్ స్టేషన్‌ను సందర్శించి పరిసరాలను, ఆవరణలో వాహనాల పార్కింగ్ ప్రదేశాలు, రిసెప్షన్, స్టేషన్‌రైటర్, టెక్‌టీమ్‌ను పరిశీలించారు. స్టేషన్‌లో రోజువారిగా నిర్వహిస్తున్న జనరల్ డైరీ, బీట్ డ్యూటీబుక్స్ తదితర రికార్డులను తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ పరిధి వివరాలను, మ్యాప్‌ను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులకు సూచించారు. పోలీస్ స్టేషన్‌లో ఎంతమంది సిబ్బంది ఉన్నారు. వారు ఏ విధులు నిర్వహిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ నుంచి నిత్యం ఎన్ని బ్లూకోల్ట్స్, పెట్రో కార్స్ విధులు నిర్వహిస్తున్నా యని, పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కడెక్కడ ఎన్ని బీట్స్ నడుస్తున్నాయని తెలుసు కున్నారు. ప్రాపర్‌గా పెట్రోలింగ్ నిర్వహిస్తూ దొంగతనాలు జరుగకుండా చూసుకోవాలని ఆదేశించారు. విస్తృతంగా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టి రోడ్డు ప్రమాదాలను నియంత్రించాల న్నారు. డయల్ 100 కాల్ రాగానే వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని సమస్య పరిష్కరి ంచాలన్నారు. సిబ్బంది తమకు కేటాయించిన గ్రామాల పూర్తి సమాచారం సిబ్బంది అందరి దగ్గర ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలను తీర్చాలని, ప్రజా ఫిర్యాదులలో ఎటు వంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలన్నారు. తాండూరు డిఎస్పీ బాలకృష్ణారెడ్డి, రూరల్ సిఐ నగేష్, కరణ్ కోట్ ఎస్సై రాథోడ్ వినోద్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# అదనపు ట్రాన్స్ఫారం మంజూరు చేయాలని గ్రామస్తుల నిరసన...

### మద్దతు తెలిపిన పిఎన్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు రాఘవేందర్ గౌడ్



**కుల్కచర్ల, మేజర్ న్యూస్ (అక్టోబర్ 30)**

కుల్కచర్ల మండల పరిధిలో ఘనపూర్ గ్రామంలో దళిత రైతులు ఆందోళన చేశారు.గ్రామ పరిధిలో పెద్ద చెరువుగట్టు దగ్గర గ్రామ పంచాయతీకి మోటారుకు ఒక కలెక్షన్ అదే ట్రాన్స్ఫారం రైతులకు ఉంది కావున అదనపు ట్రాన్స్ఫారం మాకు ఇవ్వాలని దళితులందరూ ఆందోళన చేశారు. ఈ ఆందోళనకు పరిగి నియోజకవర్గ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్ మద్దతు తెలుపుతూ ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఒకే ట్రాన్స్ఫారం దగ్గర 15వరకు కలెక్షన్లు ఉన్నాయి. కరెంటు పోవడంతో ట్రాన్స్ఫారం కాలిపోవడంతో తీవ్ర ఇబ్బందులు నెలకొన్నాయి. దయచేసి వెంటనే రైతులకు దళితులకు న్యాయం చేయాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో బాలయ్య, కృష్ణయ్య, వెంకటయ్య, మొగులయ్య, నర్సింలు, మాసయ్య గ్రామస్తులు పాల్గొన్నారు.

# నిరుపేదల ఆకలి తీరుస్తున్న శ్రీ రాజమాత ఫౌండేషన్ :ఛైర్మన్ ఉదయ్ రెడ్డి





**ఘట్‌కేసర్ రూరల్, మేజర్ న్యూస్ (అక్టోబర్ 30):** నిరాశ్రయులు, నిరుపేదలు, వికలాంగుల ఆకలి తీరుస్తూ సామాజిక సేవలో ముందంజలో ఉన్నామని శ్రీ రాజమాత ఫౌండేషన్ ఛైర్మన్ ఉదయ్ రెడ్డి తెలిపారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడ కేఎల్ మహేంద్రనగర్ (వికలాంగుల కాలనీ)లో గురువారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో వికలాంగులకు అన్నదానం నిర్వహించడంతో పాటు స్థానిక వికలాంగురాలైన కడియం ఉమారాణికి వీల్‌చెయర్ అందజేశారు. ఈ సందర్భంగా ఉదయ్ రెడ్డి మాట్లాడుతూ ఫౌండేషన్ ద్వారా ప్రతిరోజూ నిరుపేదలకు అన్నదానం చేసి, అవసరంలో ఉన్న వారికి సహాయం అందిస్తున్నాం అని తెలిపారు. అదేవిధంగా స్వయం ఉపాధి అవకాశాలు కల్పించి, ఆర్థికంగా అండగా నిలుస్తున్నాం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ వైస్ ఛైర్మన్ మనోజ్ రెడ్డి, సభ్యులు సామ్రాట్ బొల్లం, కుమార్, శృతి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

# పెళ్లి వేడుకల్లో మాజీ సర్పంచుల నేత కె.రాజిరెడ్డి



**దోమ, మేజర్ న్యూస్ (అక్టోబర్ 30)**: ఎస్ జీ గార్డెన్లో జరిగిన దోమ మండలం పోతి రెడ్డి మాజీ సర్పంచ్ బంధువుల సురేష్ -మంజుల పెళ్ళీ ఇబ్రహీం పట్నం ఏసీఆర్ కన్వెన్షన్లో జరిగిన రాగ్యారి వెంకట నర్సింహా రెడ్డి -రుచిత ల పెళ్లిళ్లకు దోమ మండల మాజీ సర్పంచుల సంగం అధ్యక్షులు కె.రాజిరెడ్డి హాజరు అయ్యి నూతన వధువరులను ఆశీర్వదించారు.

## గ్రూప్-2లో ఉద్యోగం సాధించిన కానిస్టేబుల్‌కు సన్మానం

కేశంపేట, మేజర్‌న్యూస్ (అక్టోబర్ 30): కేశంపేట పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ గ్రూప్-2 పరీక్ష రాసి ఉద్యోగం సాధించిన ఉమాను గురువారం మండల బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ ఫ్యామిలీ చూసుకుంటూ పట్టుదలతో చదువుకుని సెక్రటరియేట్‌లో ఉద్యోగం సాధించిన ఉమాను నాయకులు ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కర్రెడ్ల నరేందర్‌రెడ్డి, కంచుకోట మహేష్, కల్వకోల్ తిరుపతి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



## ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం నేర్పాలి : షర్ఫుద్దీన్ హామేద్

### జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో జల్ పల్లి బిఆర్ఎస్ నాయకులు





జల్ పల్లి, మేజర్ న్యూస్ (అక్టోబర్ 30):జూబ్లీహిల్స్ ఎన్నికలో ముస్లింలు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం నేర్పాలని జల్ పల్లి బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ షర్ఫుద్దీన్ హామేద్ అన్నారు. ఓట్లు పొందడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అజహరుద్దీన్ కి మంత్రి పదవి అంటూ ముస్లింలను మరో సారి మోసం చేయడానికి ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఈ మేరకు గురువారం జూబ్లీహిల్స్ లో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.కాంగ్రెస్ నేత అజారుద్దీన్ కు మంత్రి పదవి ఇవ్వనున్నట్లు, రేపే తెలంగాణ కేబినెట్ విస్తరణ ఉంటుందని, అజారుద్దీన్ తెలంగాణ మంత్రిగా ప్రమాణ స్వీకారంచేస్తాడని సోషల్ మీడియా లో ప్రచారం చేస్తున్నారని తెలిపారు. అజహరుద్దీన్ కి మంత్రి పదవి ఇవ్వరు, అదంతా ఎలక్షన్ స్టంట్ అని, ముస్లింలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరో సారి మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ముస్లింలు రేవంత్ రెడ్డిని మరోసారి నమ్మి మోసపోవడానికి సిద్ధంగా లేరన్నారు. అజారుద్దీన్ కు మంత్రి పదవి ఇచ్చే ఆలోచన వుంటేజూబ్లీహిల్స్ టికెట్ అజారుద్దీన్ కు ఎందుకు ఇవ్వకుండా మోసం చేశారని ప్రశ్నించారు. ఇప్పుడు ఓట్ల కోసం మంత్రి పదవి ఇస్తున్నట్లుగా మీడియాలో డ్రామా చేస్తున్నారని మండిపడ్డారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో నవీన్ యాదవ్ కు ఓటు వేసి ముస్లింలు మోసపోవొద్దని పిలుపునిచ్చారు. ముస్లింలపై రేవంత్ రెడ్డికి ప్రేమ ఉంటే ముస్లింలకు టికెట్ ఎందుకు ఇవ్వలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. నవీన్ యాదవ్ లాంటి రౌడీ షీటర్ కి టికెట్ ఇచ్చినప్పుడే కాంగ్రెస్ ఓడిపోయిందని విమర్శించారు.జూబ్లీహిల్స్ లోని ముస్లిమ్స్ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లింలకు కు చేస్తున్న మోసాలను చూశారని, ఎవ్వరు ఎన్ని జిమ్మికులు చేసిన ముస్లింల ఓట్లు ముకుమ్ముడిగా బిఆర్ఎస్ కు వేసి భారీ మెజారిటీ తో గెలిపిస్తరన్నారు.

## 45 ఏళ్లకు మత్తడి పారిన సహదేవమ్మ చెరువుకు సారె

### సహదేవి సముద్రం చెరువుకు తొలి పూజలు చేసిన శ్రీనివాస్ యాదవ్





తలకొండపల్లి, మేజ్‌న్యూస్ (అక్టోబర్ 30) : మండల పరిదిలోని వెల్జాల్ గ్రామంలోని ప్రసిద్ధి చెందిన సహదేవి సముద్రం చెరువు 45 ఏళ్లకు అలుగు పారడంతో గురువారం భారాస సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ శ్రీనివాస్ యాదవ్ తొలి పూజలు చేశారు. చెరువులో ప్రత్యేకంగా పూజలు చేసి, సహదేవమ్మ మాతకు చీర సారే సమర్పించి, అలుగు వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా అలుగు వద్ద చెరువుకు బలి వేడుకను ఘనంగా నిర్వహించారు. వెల్జాల్, చౌదర్పల్లి, మాదాయిపల్లి, మెదక్ పల్లి, గట్టు ఇప్పలపల్లి, చంద్రధన తదితర గ్రామాల నుంచి తరలివచ్చిన ప్రజలతో కలిసి పూజ నిర్వహించారు. వందలాది మంది ప్రజలు, రంగారెడ్డి, నాగర్ కర్నూల్, మహబూబ్నగర్ జిల్లాల ప్రజలు 45 ఏళ్లుగా చెరువు అలుగు పారడం కోసం ఎదురుచూస్తున్న ప్రజల కల నెరవేరిందని శ్రీనివాస్ యాదవ్ ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మోహన్ లాల్, బాలకిష్టయ్య, నరేందర్ గౌడ్, ముజ్బుర్ రెహమాన్, విష్ణువర్ధన్, విజయ్ కుమార్ గుప్తా, శ్రీకాంత్, శేఖర్, శ్రీరామ్, శంకర్, కృష్ణ, పాండు, వెంకటయ్య, రామస్వామి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానం ప్రాణదానంతో సమానం : సీఐ కె.సీతారాం

### రక్తదాన శిభిరంలో పాల్గొన్న పోలీసులు,యువకులు

కందుకూరు, మేజర్‌న్యూస్ (అక్టోబర్ 30): రక్తదానం చేయడం అనేక మందికి జీవదానంతో సమానమని సీఐ కె.సీతారాం పేర్కొన్నారు. పోలీసుల అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా గురువారం మహేశ్వరంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిభిరంలో కందుకూరు పోలీసులు, మండలానికి చెందిన యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ...రక్తదానం మహత్తరమైన సేవా అని ప్రాణాలను రక్షించే ఇట్టి కార్యక్రమంలో భాగస్వామ్యం కావడం గర్వంగా ఉందన్నారు. సమాజానికి సేవ చేయడంలో పోలీసులు ఎల్లప్పుడు ముందుంటారని పేర్కొన్నారు. సమాజంలో ఎందరో అభాగ్యులు ఆపద సమయంలో రక్తం లభించక ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు ఉన్నాయన్నారు. ఆరోగ్యంగా ఉన్నవారు స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు రావాలన్నారు. రక్తదానం చేసిన పోలీసులు శివ కుమార్,చరణ్‌కుమార్, ప్రశాంత్,రాజశేఖర్, శేఖర్, మురళీ కృష్ణ,




యువకులు లిఖిత్, వెంకటేష్ గౌడ్, నవీన్,రాఘవేందర్,అంజిరెడ్డి, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## రైతులు అధైర్యపడవద్దు : జిల్లా వ్యవసాయాధికారిణి ఉష



షాద్‌నగర్, మేజర్‌న్యూస్(అక్టోబరు 30): అకాల వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులు ఎవ్వరూ అధైర్యపడవద్దని, ప్రభుత్వం వారిని ఆదుకోవడానికి సిద్ధంగా ఉందని రంగారెడ్డి జిల్లా వ్యవసాయాధికారిని ఉష అన్నారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండలంలోని మొగిలిగిద్ద గ్రామంలో పర్యటించిన ఆమె వర్షాల కారణంగా నష్టపోయిన పలు వ రి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వ యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. అకాల వర్షం కారణంగా 33 శాతం కంటే ఎక్కువగా నష్టపోయిన రైతుల వివరాలను ఉన్నతాధికారులకు నివేదిక అందించి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా అన్ని గ్రామాలలో రైతులు నష్టపోయిన అన్నిరకాల పంటలను పరిశీలించి పూర్తి నివేదికను అంద జేయాలని వ్యవసాయ విస్తరణ అధికారులను ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పరూఖ్‌నగర్ మండల వ్యవసాయాదికారి నిశాంత్‌కుమార్, ఫరూఖ్‌నగర్ వ్యవసాయ విస్తరణ అధికారి తేజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నారాయణ పాఠశాలలో స్టూడెంట్ లేద్ - కాన్ఫరెన్స్



గండిపేట్, మేజర్ న్యూస్ (అక్టోబర్ 30) బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కిస్మత్పూర్ నారాయణ సి బి ఎస్ సి పాఠశాలలో స్టూడెంట్ లేద్ - కాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రథమ ద్వితీయ తరగతులు చదువుకునే విద్యార్థులు వారు నేర్చుకున్న విషయాలను. తెలుగు హిందీ ఇంగ్లీష్ గణిత సామాన్య సాంఘిక శాస్త్రాలకు సంబంధించిన సబ్జెక్టులలో ప్రాజెక్టులను ప్రదర్శించారు. ప్రాజెక్టులను తయారు చేసి ప్రదర్శించడంతోపాటు వాటి ప్రాముఖ్యతను ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు వివరించారు. విద్యార్థుల ప్రతిభను పాఠశాల యజమాన్యం అభినందించి విద్యార్థులకు మెడల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జిఎం గోపాల్ రెడ్డి ఏజీఎం శ్రీనివాస్ రెడ్డి, ఆర్. అండ్. డి. హెచ్ సునీత, ఈ ఛాన్స్ కోఆర్డినేటర్ తబిత, ప్రిన్సిపల్ జె. సురేష్, వైస్ ప్రిన్సిపల్ రమ్య, ఏవో మనోజ్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్లు కూలిన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు

### కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి



మంచాల, మేజర్ న్యూస్ (అక్టోబర్ 30) : మొంథా తుఫాను కారణంగా కురిసిన అకాల వర్షానికి ఇళ్లు కూలిన పేదలకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సహకారంతో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యేలా కృషి చేస్తానని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. మండలంలోని ఆరుట్ల గ్రామంలో కూలిన ఇండ్లను స్థానిక నాయకులతో కలిసి ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇండ్లు కూలిన పేదలు అధైర్యపడొద్దని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు బుట్టి కృష్ణ, కంబాలపల్లి బుగ్గరాములు, మార లక్ష్మణ్, కాంగ్రెస్ నాయకులు మార సురేష్, ఎన్నిదుల సురేష్, మానిపాటి వెంకటేష్, నూకం మల్లేష్, నూకం బాల్‌రాజ్, భాస్కర్, ఎండీ అశ్రఫ్, ఆంజనేయులు, ఇండ్లు కూలిన బాధితులు, గ్రామస్థులు ఉన్నారు.

# దేశ ఐక్యతకు ప్రతీక సర్దార్ వల్లభాయ్ పటేల్

**● జాతీయ స్థాయిలో 150వ జయంతి వేడుకలు ● ప్రతి పౌరుడూ ఆయన సిద్ధాంతాలను అనుసరించాలి : ఎంపీ ఈటల రాజేందర్ పిలుపు**




**మేడ్చల్ జిల్లా ప్రతినిధి,మేజర్ న్యూస్(అక్టోబర్, 30):** దేశ ఐక్యతకు ప్రతీకగా నిలిచిన సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి వేడుకలు దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహించనున్నట్లు బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తెలిపారు. ఈ వేడుకలను ప్రతి జిల్లాలో విశాలంగా నిర్వహించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన చెప్పారు. షామీర్‌పేటలోని తన నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పటేల్ చూపిన మార్గం దేశ అభివృద్ధికి మార్గదర్శకమని పేర్కొన్నారు."దేశం ఐక్యంగా, సుభిక్షంగా ఉండేందుకు సర్దార్ పటేల్ చేసిన త్యాగం, పట్టుదల, కార్యదీక్ష ప్రతి భారతీయుడికి ఆదర్శం. ఆయన తపన వల్లే అనేక సంస్థానాలు భారతదేశంలో విలీనం అయ్యాయి," అని ఈటల గుర్తు చేశారు.

**స్వేచ్ఛ ఊరికే రాలేదు - ఈటల:**

"మనకు లభించిన స్వేచ్ఛ, స్వాతంత్రం ఊరికే వచ్చినవి కావు. మనం ఎగరవేసే త్రివర్ణ జెండా వెనుక వేలాది స్వాతంత్ర్య సమరయోధుల రక్తం ఉంది. వందలాది మంది అండమాన్ వంటి భయంకర జైళ్లలో జీవితాన్ని గడిపారు. వారి త్యాగాలను మరవకూడదు. ప్రధాని నరేంద్ర మోడీ గారి పిలుపు మేరకు దేశవ్యాప్తంగా ఈ వేడుకలు నిర్వహించడం ఆ త్యాగాలకు నివాళి అర్పించడం వంటిదే," అని ఎంపీ అన్నారు.

**ర్యాలీకి ఆహ్వానం:**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 8 కిలోమీటర్ల ర్యాలీను త్వరలో నిర్వహించనున్నట్లు ఈటల తెలిపారు. "15 నుండి 29 సంవత్సరాల మధ్య ఉన్న యువత క్యూఆర్ కోడ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని తప్పనిసరిగా పాల్గొనాలి. ఇది రాజకీయాలకతీతంగా దేశభక్తి ఉత్సవం. పార్టీలు, జెండాలు పక్కన పెట్టి 'ఒకటే జెండా - మువ్వన్నెల జెండా, ఒకటే సిద్ధాంతం - భారత జాతి సిద్ధాంతం' అనే భావనతో అందరం కలిసిరావాలి," అని ఆయన పిలుపునిచ్చారు.

**సమగ్ర భాగస్వామ్యం:**

ఈ వేడుకల్లో క్రీడాకారులు, వివిధ రంగాల్లో నిపుణులు, సమాజహితం కోరుకునే వ్యక్తులు, యువతతో పాటు ఎన్సీసీ, ఎన్ఎస్ఎస్ సభ్యులను కూడా భాగస్వామ్యం చేస్తామని ఎంపీ చెప్పారు. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల వారీగా కూడా ర్యాలీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అనంతరం జయంతి వేడుకలకు సంబంధించి పోస్టర్ ను ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో మైభారత్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా యువజన, క్రీడల అధికారి ఐసయ్య, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా యువజన, క్రీడల అధికారి దామోదర్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ అధికారి విశ్వనాథ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏనుగు సుదర్శన్ రెడ్డి, మేడ్చల్ జిల్లా రూరల్ బీజేపీ అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్, బీజేపీ నాయకులు బోడ శ్రీనివాస్, అమరం మోహన్ రెడ్డి, విజయ్ కుమార్, శ్రీనివాస్, మహేందర్ రెడ్డి, ముత్యం రెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.




# మూడు చింతలపల్లి తాసిల్దారుగా సుచరిత... బాధ్యతలు స్వీకారం

**● స్వాగతం పలికిన రెవెన్యూ సిబ్బంది, నాయకులు**



**తాసిల్దార్ సుచరితకు శుభాకాంక్షలు తెలుపుతున్న క్యాతం మధు కృష్ణ,రెవెన్యూ అధికారులు.**

**శామీర్‌పేట, మేజర్ న్యూస్ (అక్టోబర్, 30):** మేడ్చల్ జిల్లా మూడు చింతలపల్లి మండల నూతన తాసిల్దారుగా సుచరిత గురువారం పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రెవెన్యూ కార్యాలయంలో సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి ఆమెకు స్వాగతం పలికారు. కొత్త తాసిల్దార్ సుచరితకు లక్ష్మాపూర్ యువ నాయకుడు క్యాతం మధుకృష్ణ పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ సునీల్, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, సిబ్బంది, స్థానిక నాయకులు క్యాసారం శ్రీనివాస్ చారి, అప్పాల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత క్యాన్సర్ పరీక్షలు





దోమ, మేజర్ న్యూస్ (అక్టోబర్ 30): ప్రాథమిక ఆరోగ్య కేంద్రం దోమలో ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ అసోసియేషన్ తరపున రాష్ట్ర కమిషనర్ ఫ్యామిలీ వెల్ఫేర్ వారి పిలుపుమేరకు మారుమూల ప్రాంతాల యందు ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పవిత్ర సూచనల మేరకు, జిల్లా ఎన్సిడి విభాగం అధికారిని డాక్టర్ నిరోషా పర్యవేక్షణలో, స్థానికట్ డాక్టర్ రజిత మెడికల్ ఆఫీసర్ అధ్యక్ష తన పెద్ద ఎత్తున ఉచిత క్యాన్సర్ పరీక్షలు నిర్వహించడం జరిగింది ఇందులో ప్రధానంగా దోమ పరిసర ప్రాంతాల నుండి 104 మందికి ఉచిత క్యాన్సర్ పరీక్షలు వివిధ రకాలైన వైద్య సేవలు అందించడం జరిగింది. అంతేకాకుండా ఎన్సీడీలో భాగంగా 39 మందికి గాను ఆన్లైన్ సేవలు అందించడం జరిగింది. అదేవిధంగా ఏచ్‌పివి/డిఎన్ఏ పరీక్షలు, రొమ్ము స్క్రీనింగ్, నోటి క్యాన్సర్ పరీక్షలు, మామోగ్రామ్ పరీక్షలు అందించడం జరిగినది..ఇందులో పల్లె దవాఖాన మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అఖిల్ డాక్టర్ సాయి తేజ, సిహెచ్‌ఓ విజయలక్ష్మి, ఎంపిహెచ్ ఈఓ ప్రభులింగం వైద్య సిబ్బంది, సూపర్వైజర్ సిబ్బంది, ఏఎన్ఎంలు ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

# నేడు మహిబూబ్‌సుభానీ దర్గా గంధోత్సవం

**కొడంగల్, మేజర్ న్యూస్ (అక్టోబరు 30):** మహిబూబ్‌సుభానీ దర్గా గంధోత్సవాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు మైనారిటీ నాయకుడు ఎస్.ఎం.గౌసన్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ కొడంగల్ పట్టణంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలోని మహిబూబ్‌సుభానీ దర్గా గంధోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రత్యేక ప్రార్థనల అనంతరం జామే మస్జీద్ నుంచి ర్యాలీగా బయలుదేరి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రార్థనల అనంతరం సాయంత్రం అన్నదానం ఏర్పాటు చేసినట్లు తలిపారు. అదే విధంగా శనివారం ఉదయం స్థానిక జామే మస్జీద్‌లో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

# ఇందిరమ్మ రాజ్య స్థాపనకు ప్రజా ప్రభుత్వం కృషి

**● ప్రతి నిరుపేదకు ఇల్లు అందించడం మా బాధ్యత : తోటకూర వజ్రేష్ యాదవ్**

**శామీర్ పేట,మేజర్ న్యూస్ (అక్టోబర్,30):**

ఇందిరమ్మ రాజ్యం స్థాపన కోసం సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. ప్రతి నిరుపేదకు ఇల్లు కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు.గురువారం అలియాబాద్ మున్సిపాలిటీ తుర్కపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం నిర్వహించి లబ్ధిదారులను అభినందించిన ఆయన మాట్లాడుతూ, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం ఇళ్లు నిర్మించి అందజేస్తోందని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా వేలాది పేద కుటుంబాలకు స్వగృహ సంతోషం లభించిందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,.. "ఇందిరమ్మ రాజ్యం అనేది కేవలం నినాదం కాదు, ఇది ప్రతి పేద మనిషి కల. ఆ కలను సాకారం చేయడమే మన కర్తవ్యం. ఇల్లు లేని వారికి ఇళ్లు కట్టించడమే మా ప్రాధాన్యత" అని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింలు యాదవ్, మేడ్చల్ ఏ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు జీడిపల్లి వేణుగోపాల్ రెడ్డి, అలియాబాద్, మూడు చింతలపల్లి, తూముకుంట మున్సిపాలిటీల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంకి రమేష్, దోసకాయల వెంకటేష్, భీమిడి జైపాల్ రెడ్డి, అలియాబాద్ మాజీ సర్పంచ్ కంఠం కృష్ణారెడ్డి, మున్సిపాలిటీ కమిషనర్ చంద్రశేఖర్, హౌసింగ్ డీఈ అశోక్, ఏఎంసీ డైరెక్టర్ తుంకి బిక్షపతి, ఎస్సీ సెల్ నాయకులు ఊరడి వెంకటేష్, నాయకులు భూమిరెడ్డి, నవీన్ రెడ్డి, కొమ్ము వినోద్, బండి సతీష్, మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.







# మేడిపల్లి కలాన్‌లో ఉచిత వైద్య శిబిరం...

**పూడూర్, మేజర్ న్యూస్ (అక్టోబర్ 30):** ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం సద్వినియోగం చేసుకోవాలని యువజన నాయకులు రవికుమార్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని మేడిపల్లి కలాన్ గ్రామంలో మెడిక్యూర్ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం జరిగింది. వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచిత మందులు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పేదలందరికీ కార్పొరేట్ స్థాయిలో వైద్యాన్ని అందించాలని లక్ష్యంతో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామంలోని పేదలకు ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినందుకు మెడిక్యూర్ హాస్పిటల్ యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# మొంథా తుఫాన్ ప్రభావం

## - గుండ్లపోచంపల్లి పరిధిలో వరి పంట నష్టపోయిన రైతులు ఆందోళనలో

మేడ్చల్, మేజర్ న్యూస్ (అక్టోబర్, 30): మెంథా తుఫాన్ ప్రభావంతో మేడ్చల్ మండలంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ గౌడవెల్లి వార్డు పరిధిలో వరుసగా రెండురోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా కోతకు సిద్ధమైన వరి పంటలు పూర్తిగా నేలకొరిగిపోయాయి.తుఫాన్ గాలులతో పాటు వర్షం తీవ్రత ఎక్కువగా ఉండటంతో చేన్లలో నీరు నిల్వపడి వరి మొక్కలు వాలిపడ్డాయి. దీంతో రైతులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ఏడాది పాటు కష్టపడి సాగు చేసిన పంట ఒక్క వానతో నష్టపోవడం రైతుల ఆవేదనకు కారణమైంది.

"పంట చేతికి అందిందనుకుంటే వాన తుడిచేసింది. ఇప్పుడు ఏం చేయాలో అర్థం కావడం లేదు" అని రైతులు వేదన వ్యక్తం చేశారు.

తక్షణమే పంట నష్టాన్ని ప్రభుత్వ యంత్రాంగం అంచనా వేసి, నష్టపోయిన రైతులను ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.



# పరిశ్రమలో అగ్నిప్రమాదం

## -ఇద్దరు కార్మికులకు తీవ్రగాయాలు






షాద్ నగర్, మేజర్ న్యూస్ (అక్టోబర్ 30): పరిశ్రమలో అగ్నిప్రమాదంలో జరగడంతో ఇద్దరు కార్మికులకు తీవ్ర గాయాలయిన సంఘటన షాద్ నగర్ నియోజకవర్గంలోని ఫరూక్ నగర్ మండలంలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఫరూక్ నగర్ మండల పరిధిలోని చిల్కమర్రి గ్రామశివారులో గల న్యూ ఎర్త్ పాలీఫోం పరిశ్రమలో దాదాపు 40 మంది కార్మికులు పని చేస్తున్నారు. రోజు మాదిరిగానే ప్లాస్టిక్ ను రీ సైక్లింగ్ చేసి ఫోం తయారు చేస్తున్న ఆర్పీపీ యంత్రంవద్ద అభిషేక్, లాలుబాబు అనే ఇద్దరు కార్మికులు పని చేస్తున్నారు. గురువారం ఉదయం ఆర్పీపీ యంత్రంనుండి ఆకస్మాత్తుగా మంటలు వచ్చి ఫోమ్ కు తగలడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ క్రమంలో సేఫ్టీ పరికరాలు లేకపోవడం వలన యంత్రంవద్ద పని చేస్తున్న ఇద్దరు కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. పరిశ్రమలో పెద్ద ఎత్తున మంటలు రావడంతో భయాందోళనకు గురైన కార్మికులు బయటకు పరుగులు తీశారు. పరిశ్రమలో పని చేస్తున్న తోటి కార్మికులు గాయపడిన అభిషేక్, లాలుబాబును పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వారిని మెరుగైన వైద్యంకోసం శంషాబాద్ లోని ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇద్దరు కార్మికుల పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తుంది. విధుల్లో ఉన్న కార్మికులకు ఎలాంటి సేఫ్టీ పరికరాలను ఏర్పాటు చేయకపోవడంతోనే ఇద్దరు కార్మికులు తీవ్ర గాయాలకు గురైనట్లు తెలుస్తుంది. అగ్రిప్రమాదం జరిగిన విషయాన్ని తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా సలానికి చేరుకొని ఫైరింజన్ సహాయంతో మంటలను మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.

# వర్షాలకు నేలకొరిగిన వరిపంట - ఆందోళనలో అన్నదాతలు

▶▶ మాడ్గుల మండలం ఆర్కపల్లిలో వరిపైరు నేలకొరిగి కలతచెందుతున్న రైతులు ▶▶ వ్యవసాయశాఖ అధికారులు దెబ్బతిన్న పంటలను పరిశీలించి ప్రభుత్వపరంగా రైతులను ఆదుకోవాలి : యూత్ కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షులు కల్లు తిరుపతిరెడ్డి



వర్షానికి నేలకొరిగిన వరిపంటను చూసి ఆందోళన చెందుతున్న రైతు

మాడ్గుల, మేజర్‌న్యూస్ (అక్టోబర్ 30): ముంథా తుఫాన్ ప్రభావంతో వారం రోజులుగా ఎడతెరిపి లేకుండ కురిసిన వర్షాలకు మాడ్గుల మండలం ఆర్కపల్లితో పాటు పలు గ్రామాలలో రైతులు సాగుచేసిన వరిపంట నేలకొరిగి తీవ్ర నష్టాన్ని కలిగించింది. విత్తనాల ఎంపిక మొదలు పైరు నాటి కాపు దశకు చేరేవరకు రైతులు నిద్రాహారాలు మాని కష్టపడితే తుఫాన్ వర్షాలకు మరో 15రోజుల్లో కోతకు వచ్చిన వరిపంట పూర్తిగా నేలకొరిగి గింజలు రాలడంతో పాటు నీటమునిగి అన్నదాతల కు టుంబాల్లో ఆవేదన మిగిల్చింది. ఈ మేరకు గురువారం ఆర్కపల్లి గ్రామ శివారులో రైతులు సిరుసవాడ చంద్రశేఖర్ ప్రజాపతి, సిరుసవాడ సతీష్ ప్రజాపతితో పాటు పలువురు రైతులు సాగుచేసిన వరిపంట వర్షాలకు నేలకొరిగిన విషయం తెలుసుకున్న యూత్ కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షులు కల్లు తిరుపతిరెడ్డి, స్థానిక నాయకులతో కలిసి పంటలను పరిశీలించారు.



వర్షాలకు పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతున్న తిరుపతిరెడ్డి

ఈసందర్భంగా ఎకరాకు 25వేల రూపాయల మేరకు పెట్టుబడులతో వరిపంటను సాగుచేయగా వర్షం తమను తీవ్ర నిరాశకు గురిచేసినట్లు ఆయా పొలాల రైతులు వాపోయారు. దీంతో తిరుపతిరెడ్డి మాట్లాడుతూ వ్యవసాయాధికారులు వెంటనే క్షేత్ర పర్యటన చేపట్టి వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించడంతో పాటు నష్టం అంఛనాలను ప్రభుత్వానికి నివేదించాలని కోరారు. మాడ్గుల మండల వ్యాప్తంగా వర్షాలకు దెబ్బతిన్న పత్తి, వరి పంటలతో పాటు, కూరగాయల తోటల వివరాలను మండల కాంగ్రెస్ అధ్యక్షులు భట్టు కిషన్‌రెడ్డి సహకారంతో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి మండల రైతులను ఆదుకునేలా చూస్తామని భరోసానిచ్చారు.

# నూతనకల్ రహదారి - గుంతలమయం..!

## దుస్థితిపై ప్రజల ఆవేదన



మేడ్చల్,మేజర్ న్యూస్ (అక్టోబర్ 30): ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని నూతనకల్ గ్రామ రహదారులు ప్రజలకు నరకయాతనగా మారాయి. గ్రామంలోని బస్టాండ్ నుండి గుబ్బ కోల్డ్ స్టోరేజ్ వరకు రహదారి పూర్తిగా గుంతలతో నిండిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఎటు చూసినా గుంతలే కనబడుతున్న ఈ రహదారిపై ప్రయాణించడం సాహసంగా మారింది. రాళ్లు బయటకు తేలిపోవడం, అసమతుల్యమైన మట్టితో రోడ్డు పూర్తిగా దెబ్బతిందని ప్రజలు చెబుతున్నారు. పగటి పూట కూడా రోడ్డుపై సజావుగా ప్రయాణించలేని పరిస్థితి ఉండగా, రాత్రి వేళల్లో అయితే ప్రమాదాల భయం మరింత ఎక్కువగా ఉందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొన్ని సంవత్సరాలుగా ఈ రహదారికి మరమ్మతులు జరగకపోవడంతో గుంతలు మరింత పెరిగిపోయాయని, వర్షం పడితే నీరు నిలిచి వాహనాలు జారిపడే ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయని తెలిపారు. "ప్రతి రోజు స్కూల్ పిల్లలు, వృద్ధులు ఇబ్బంది పడుతున్నారు. కనీసం గుంతల పూర్చే పనులు అయినా చేయాలి" అని ప్రజలు కోరుతున్నారు.

# ఆపన్నహస్తం కోసం ఎదురుచూపులు...

- కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మాజీ సర్పంచ్ భర్త శ్రావణ్
- ఇప్పటి వరకు 10 లక్షలు ఖర్చు -ఇంకా 15 లక్షలు చికిత్స కోసం అవసరం
- సహాయం కోసం ఎదురుచూస్తున్న శ్రవణ్ కుటుంబ సభ్యులు



బషీరాబాద్, మేజర్ న్యూస్ (అక్టోబర్ 30):మెదడుకు దెబ్బ తగిలి ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్న మాజీ సర్పంచ్ ప్రియాంక భర్త శ్రవణ్ కుమార్ వైద్య ఖర్చుల కోసం కుటుంబ సభ్యులు ఎదురుచూస్తున్నారు. వికారాబాద్ జిల్లా బషీరాబాద్ గ్రామ పంచాయతీ సర్పంచ్ గా ప్రియాంక శ్రవణ్ కుమార్ అనేక సేవలు అందించారు. మాజీ సర్పంచ్ ప్రియాంక భర్త శ్రావణ్ కుమార్ కొద్ది రోజుల క్రితం బషీరాబాద్ మండల కేంద్రంలో అనుమానాస్పదంగా బైక్ పైనుండి కింద పడ్డారు. చికిత్స కోసం తాండూరు ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా పరిస్థితి బాలేదని హైదరాబాద్ కి తరలించాలని తెలుపగా కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం నిమిత్తం సికింద్రాబాద్ కిమ్స్ ఆసుపత్రిలో చేర్పించారు. వైద్యం చేసిన వైద్యులు మెదడుకు దెబ్బ తగిలిందని ఆపరేషన్ చేయాలని తెలుపగా ఆర్ బి ఎల్ సీఈఓ శ్రీనివాస్ రెడ్డి, కుటుంబ సభ్యులు, స్నేహితులు కలిసి 10 లక్షలు ఇప్పటివరకు వైద్యానికి అందజేశారు. ఆసుపత్రి యాజమాన్యం మెరుగైన చికిత్స కోసం ఇంకా 15 లక్షలు ఖర్చు అవుతుందని వెల్లడించారు. దీంతో కుటుంబ సభ్యులు ఇంకా 15 లక్షలు ఎలా అరేంజ్ చేయాలో తెలియక అయోమయంలో ఆందోళన చెందుతున్నారు. మినిస్టర్, ఎంపీ, ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, వ్యాపారవేత్తలు ఆర్థిక సాయం చేయాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

# నవీన్ యాదవ్‌కు ఓటు వేసి భారీ మోజార్టీతో గెలపించాలి

● తాండూరు ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్‌రెడ్డి

● జూబ్లీహిల్ ఉప ఎన్నికల్లో

ఇంటింట ప్రచారం చేస్తున్న నాయకులు

**పెద్దేముల్, మేజర్ న్యూస్ (అక్టోబర్ 30):** జూబ్లీహిల్స్ నియోజక వర్గ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలపు ఖాయమని తాండూరు ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్‌రెడ్డి అన్నారు. గురువారం హైద్రాబాద్ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతుగా వెంగల్‌రావు నగర్ డివిజన్‌లోని బూత్ నెంబర్ 141 నుండి 145 బూత్ వరకు తాండూరు ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్‌రెడ్డి ఇంటింట ప్రచారం నిర్వహించారు. ఓటర్లతో ముఖా ముఖిగ మాట్లాడి ఇప్పటి వరకు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పథకాలను తెలియచేశారు.కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు ఓటు వేసి పెద్ద మోజార్టీతో గెలపించాలని కోరాడు. ప్రజలకు నిజమైన సేవలు అందించే ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కాంగ్రెస్ తప్ప ఇతర పార్టీలకు ఓటు



వేస్తే మళ్లీ ఐదు సంవత్సరాలు అభివృద్ధి వెనుకకు పోతుందన్నారు. ప్రచారంతో తాండూరు నియోజక వర్గం నుండి పెద్ద సంఖ్యలో నాయకులు, అభిమానులు పాల్గోన్నారు. తాండూరు ఎమ్మెల్యేతో పాటు డీసీసీబీ డైరక్టర్ రవి గౌడ్, వికారాబాద్ జిల్లా మాజీ గ్రందాలయ చైర్మన్ మురళీగౌడ్, పెద్దేముల్ మాజీ జడ్పీటీసీ సభ్యుడు ఉప్పరి మల్లెశం, ఎస్సీ ఎల్ నాయకులు కిరణ్‌తో పాటు తదితరులు పాల్గోన్నారు.

# పెండింగ్ బిల్లులు, వేతనాలు వెంటనే విడుదల చేయాలి

● ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్

● సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా - కలెక్టర్‌కి వినతిపత్రం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్, (అక్టోబర్ 30) :** మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికుల పెండింగ్ బిల్లులు, వేతనాలు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వంను తెలంగాణ మిడ్ డే మీల్స్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు డిమాండ్ చేశారు.గురువారం కలెక్టర్ కార్యాలయం ఎదుట వారు ధర్నా నిర్వహించి, అనంతరం అడిషనల్ కలెక్టర్‌కి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా,జిల్లా అధ్యక్షుడు ఉన్నికృ ష్ణన్, కార్యదర్శి ప్రేమలత మాట్లాడుతూ "పాఠశాలలు ప్రారంభమైనప్పటి నుండి ఇప్పటివరకు ఎలాంటి బిల్లులు, వేతనాలు అందలేదు. దసరా పండుగ రోజున కూడా కార్మికులు కుటుంబాలతో పస్తులు కట్టిన పరిస్థితి ఈ కాంగ్రెస్ పాలనలో నెలకొంది" అని ఆవేదన వ్యక్తం చేశారు. నెలల తరబడి బిల్లులు రాకపోతే వంట వండే పరిస్థితి ఎలా ఉంటుందని ప్రశ్నించారు. వెంటనే పెండింగ్ బిల్లులు విడుదల చేసి కార్మికులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎన్నికల ముందు కార్మికులకు రూ.10,000 వేతనం ఇస్తామన్న హామీని అమలు చేయాలని, కార్మికుల పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధిని చాటుకోవాలని సూచించారు. "కొత్త మెనూ పేరుతో ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ కమిటీలు కార్మికులను అనవసర




ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. అయినప్పటికీ విద్యార్థులను తమ పిల్లలుగా భావించి ప్రతిరోజూ నాణ్యమైన, రుచికరమైన భోజనం అందిస్తు న్నారు" అని ఉన్నికృష్ణన్ తెలిపారు. ధరలు పెరుగుతున్న నేపథ్యంలో మెనూ చార్జీలను సవరించాలి, అంగన్వాడీల మాదిరిగా గుడ్ల సరఫరా ప్రభుత్వం చేపట్టా లి, వంట గ్యాస్‌ను ఉచితంగా ఇవ్వాలి, కాటన్ యూనిఫామ్‌లు అందించాలి, కనీస వేతనం రూ.26,000 అమలు చేయాలి, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలి అని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్. శ్రీనివాస్, యూనియన్ నాయకులు విజయలక్ష్మి, మంజుల, జయతో పాటు పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

## న్యాయం చేయాలని తహసిల్దార్ కార్యాలయంలో నిరసన



**కుల్కచర్ల, మేజర్ న్యూస్ (అక్టోబర్ 30)**కుల్కచర్ల మండల పరిధిలోని బండవెల్లికి చెర్లలో కబ్జాకు గురవుతున్న భూమిని కాపాడి పేదవారికి న్యాయం చేయాలని నిరసిస్తూ కుల్కచర్ల మండల తహసిల్దార్ కార్యాలయంలో నిరసన చేపట్టారు. వివరాల ప్రకారం మండల పరిధిలోని బండవెల్లికిచర్ల గ్రామంలో 1983 సంవత్సరంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో గ్రామంలో ఒక కుటుంబం నుండి 543, 563 సర్వే నెంబర్ల నుండి ప్రభుత్వం 2 ఎకరాల 7 గుంటల భూమిని కొనుగోలు చేసి నిరుపేద కుటుంబాలకు చెందిన పేదవారికి ఇండ్లు నిర్మించు కోవడానికి స్థలాన్ని కేటాయించడం జరిగింది. కాగా కొందరు అట్టి భూమిలో అక్రమంగా ప్రహరీ నిర్మించి ఇబ్బందులకు గురి చేస్తున్నారని పెద్ద తెలుగు కాలనీవాసులు నిరసన తెలిపారు. ఇట్టి విషయమై ఎమ్మార్వో వాగ్వాదానికి దిగారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని నచ్చ చెప్పారు. ఎమ్మార్వో మాట్లాడుతూ... సరైన ధ్రువపత్రాలను సేకరించి సర్వే నిర్వహించి తగిన న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. ఈ కార్యక్రమంలో పెద్ద తెలుగు కాలనీవాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పోచారం తిరుమలకుంటలో కాలుష్యంపై హైడ్రా అధికారుల పరిశీలన




**ఘట్‌కేసర్ రూరల్, మేజర్ న్యూస్ (అక్టోబర్ 30) :** పోచారం మున్సిపాలిటీ పరిధిలోని తిరుమలకుంటలో కాలుష్యం సమస్యపై హైడ్రా అధికారులు గురువారం పరిశీలించారు. ఇన్ఫోసిస్ హాస్టల్ నుండి డ్రైనేజీ నీరు చెరువులోకి చేరుతోందని స్థానికులు చేసిన ఫిర్యాదు మేరకు హైడ్రా సీఐ సైదులు పరిస్థితిని పరిశీలించారు. చెరువుకు హద్దులు ఏర్పాటు చేయడం, డ్రైనేజీ నీరు చెరువులోకి చేరకుండా తగిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు సీఐ సూచించినట్లు పోచారం మాజీ ఉపసర్పంచ్ ఆకిటీ బాల్ రెడ్డి తెలిపారు. చెరువు నీరు తీవ్రంగా కాలుష్యానికి గురవుతోందని, అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని బాల్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ పరిశీలనలో ఆకిటీ యుగేందర్ రెడ్డి, చెరుకు భరద్వాజ్ గౌడ్, బద్దం రుక్ వర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కరణ్ కోట్ ఎస్‌హెచ్‌ఓ రూమ్ ఏర్పాటు...

● ఆదాని సిమెంట్ కర్మాగారం చేయూత

● భూమి పూజ నిర్వహించిన ఎస్పీ నారాయణరెడ్డి



**తాండూర్ రూరల్, మేజర్ న్యూస్ (అక్టోబర్ 30):** కరణ్ కోట్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్ హెచ్‌ఓ రూమ్ ఏర్పాటుకు వికారా బాద్ జిల్లా ఎస్పీ నారాయ ణ రెడ్డి గురువారం భూమి పూజ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ఆదాని సిమెంట్ కర్మాగారం కరణ్ కోట్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్‌హెచ్‌ఓ రూము, పిటిషన్ దారులు కూర్చోవడానికి హాలు నిర్మాణానికి సహకారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆదాని సిమెంట్ కర్మాగారం ప్రతినిధి నాగార్జున ఆధ్వర్యంలో భూమి పూజ కార్యక్రమం నిర్వహించుకోవడం ఎంతో సంతోషకరమని కొనియాడారు. ఆదాని సిమెంట్ కర్మాగారం ద్వారా మండల పరిధిలోని ఓగిపూర్, కర న్ కోట్, చంద్రవంచ, బెల్కు టూర్, చిట్టి ఘనపూర్, గుంత బస్ పల్లి గ్రామాలలో దత్తత తీసుకొని పలు అభివృద్ధి పనులు కొనసాగిస్తున్నామని ఆగాని సిమెంట్ కర్మాగార ప్రతినిధి నాగార్జున పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తాండూరు డిఎస్పి బాలకృష్ణారెడ్డి, సిఐ నగేష్ ,ఎస్సై రాథోడ్ వినోద్, ఆదాని సిమెంట్ కర్మాగార అధికారులు దినేష్,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పేద ప్రజలను ఆదుకోవటమే లక్ష్యంగా కృషి: సామల సందీప్ రెడ్డి



**ఘట్‌కేసర్ రూరల్, మేజర్ న్యూస్(అక్టోబర్30):** పేద ప్రజలను ఆదుకోవడం, అవసరంలో ఉన్న వారికి అండగా నిలవడం తన ప్రధాన ధ్యేయమని బీఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు, ఎస్‌వైఆర్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి సామల సందీప్ రెడ్డి అన్నారు. పోచారం మున్సిపాలిటీ పరిధి వెంకటాపురం గ్రామానికి చెందిన అందె సత్తమ్మ అనారోగ్యంతో మృతి చెందగా, వారి కుటుంబానికి ఆర్థికంగా తోడ్పాటునిస్తూ ఎస్‌వైఆర్ ఫౌండేషన్ తరఫున రూ.10 వేల సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద కుటుంబాలను ఆదుకోవడమే మన ప్రధాన ధ్యేయం అని అన్నారు. అవసరంలో ఉన్న వారికి సహాయం అందించటం మన మానవతా ధర్మం అని పేర్కొన్నారు. ఎస్ వై ఆర్ ఫౌండేషన్ సామాజిక బాధ్యతతో అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తుందని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కందుల నవీన్ కుమార్, నీరుడు శ్రీనివాస్, కట్టా కృష్ణ గౌడ్, తదితర నాయకులు, ఎస్‌వైఆర్ ఫౌండేషన్ సభ్యులు, టీమ్ ఎస్ఎస్ఆర్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## మందు బాబులకు జరిమానా విధించిన న్యాయమూర్తి హర్ష చౌదరి...

### వివరాలు వెల్లడించిన రూరల్ సీఐ నగేష్

**తాండూర్ రూరల్,మేజర్ న్యూస్ (అక్టోబర్ 30):** తాండూరు మండల పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన మందుబాబుల కు తాండూరు న్యాయమూర్తి హర్ష చౌదరి జరిమానాలు విధించినట్లు రూరల్ సీఐ నాగేష్ తెలిపారు.తాండూర్ రూరల్ సర్కిల్ పరిధిలోని యలాల్, పెద్దేముల్,బషీరాబాద్ కరణ్ కోట్ పోలీస్ స్టేషన్ పరిధిలో 38 మంది పై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేయగా గురువారం తాండూర్ మెజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా మద్యం సేవించి వాహనాలు నడిపిన వ్యక్తులకు కరణ్ కోట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కేసులకు 12 మందికి 20000 రూపాయలు, యలాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 15 మందికి రూపాయలు 27,500, పెద్దేముల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆరు మంది పై కేసు నమోదు చేయగా 11 వేల రూపాయలు ,బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో 8 కేసులు నమోదు కాగా 8000 రూపాయలు జరిమానా విధించినట్లు రూరల్ సీఐ నగేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# మీసేవ లైసెన్సు రద్దు



ఆమనగల్లు, మేజర్ న్యూస్ (అక్టోబర్ 30 )ఆమనగల్లు పట్టణంలో నిర్వహిస్తున్న కిషోర్ కమ్యూనికేషన్ మీసేవ సెంటర్ లైసెన్స్ శాశ్వతంగా రద్దు చేసినట్లు తహసిల్దార్ మహమ్మద్ ఫహీం ఖాద్రి చెప్పారు. గురువారం ఆయన మాట్లాడుతూ మీసేవ కమిషనర్ ఉత్తర్వుల మేరకు ఈనెల 27 నుండి రద్దు చేసినట్లు ఆయన వివరించారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి ఆ సెంటర్ లో ఎలాంటి కార్యకలాపాలు చేయవద్దని సూచించారు. ఫోటో 30 ఏఎంజిఎల్ 05 మాట్లాడుతున్న తహసిల్దార్ రహీం ఖాద్రి.

## తుఫాన్‌తో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

▸▸ మాడ్గుల మండలంలో వారంరోజులపాటు ఎడతెరిపిలేని వర్షాలకు పూర్తిగా దెబ్బతిన్న పత్తి, వరిపంటలు

▸▸ పత్తిరైతులకు ఎకరాకు రూ.30వేలు, వరిపంట దెబ్బతిన్న రైతులకు ఎకరాకు 20వేల పరిహారం చెల్లించాలి : మాడ్గుల మాజీ ఎంపిపి జర్పుల జైపాల్‌నాయక్



మాడ్గుల, మేజర్‌న్యూస్ (అక్టోబర్ 30): సాగునీటి వనరులు లేక మెట్ట పంటలపైనే ఆధారపడ్డ మాడ్గుల మండల రైతులకు ముంథా తుఫాన్ తీవ్ర నష్టాన్ని మిగిల్చిందని మాడ్గుల మండల మాజీ ఎంపిపి జర్పుల జైపాల్‌నాయక్ అన్నారు. గడిచిన వారం రోజులు ఎడతెరిపి లేకుండ కురిసిన వర్షాలతో లక్షల రూపాయల పెట్టుబడులతో సాగుచేసిన పత్తిపంట తీరా చేతికొచ్చే సమయంలో వర్షం కారణంగా చేనుపైనే నల్లబడి, పూర్తిగా తడిసి ముద్దయిపోగా, వేల రూపాయల పెట్టుబడులతో సాగుచేసిన వరిపైరు ఈదురుగాలుల వర్షానికి నేలకొరిగి రైతులకు అపార నష్టాన్ని మిగిల్చిందని తెలిపారు. ఈ మేరకు మాడ్గుల మండలంలో ముంథా తుఫాన్ వల్ల నష్టపోయిన రైతుల ఇబ్బందులను గురువారం మాజీ ఎంపిపి మేజర్‌న్యూస్‌తో వెల్లడిస్తూ ఎడతెరిపి లేకుండ కురిసిన వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన పత్తి, వరిపంటలు సాగుచేసిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆదుకునేలా చర్యలు చేపట్టి పత్తి పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు 30వేల రూపాయల పరిహారం, వరిపంట నష్టపోయిన రైతులకు ఎకరాకు 20వేల రూపాయల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ప్రధానంగా వరి, పత్తిపంటల సాగులో భాగంగా ఈ యేడాది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉదాసీన మూలంగా యూరియా కొరకు రైతులు రోజులతరబడి పడిగాపులు గాసి అనేక అగచాట్లకు గురైనట్లు తెలిపారు. అనేక వ్యయప్రయాసలకోర్చి సాగుచేసిన పంటలు తీరా చేతికొచ్చే సమయంలో తుఫాన్ వర్షాలు రైతు కుటుంబాలను ఆందోళనకు గురిచేసినట్లు మాజీ ఎంపిపి జైపాల్‌నాయక్ వివరించారు. తుఫాన్ వర్షాలతో పంటలు నష్టపోయిన రైతాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆదుకునేలా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

## తెలంగాణ కేబినెట్‌లో అజారుద్దీన్‌కు స్థానం దక్కడం హర్షణీయం

▸▸ నేడే మధ్యాహ్నం 12-15 గంటలకు రాష్ట్ర మంత్రిగా అజారుద్దీన్ ప్రమాణస్వీకారం ▸▸ మైనార్టీలకు కెబినెట్‌లో స్థానం కల్పించిన ముఖ్యమంత్రికి ముస్లీం, మైనార్టీల తరపున కృతజ్ఞతలు ▸▸ వివరాలు వెల్లడించిన కెఎన్ఆర్ సేవాదళం వ్యవస్థాపక అధ్యక్షులు మహ్మద్ బాబా



మాడ్గుల, మేజర్‌న్యూస్ (అక్టోబర్ 30): ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సారథ్యంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కేబినెట్‌లో మైనార్టీలకు స్థానం దక్కడం హర్షణీయమని కెఎన్ఆర్ సేవాదళం వ్యవస్థాపక అధ్యక్షులు మహ్మద్ బాబా అన్నారు. ప్రముఖ మాజీ క్రికెటర్, కాంగ్రెస్ సీనియర్ నేత మహ్మద్ అజారుద్దీన్‌కు రాష్ట్ర కెబినెట్‌లో మంత్రి పదవి దక్కి శుక్రవారం మధ్యాహ్నం 12గంటల 15 నిమిషాలకు ఆయన మంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నారని బాబా ఆనందం వ్యక్తం చేశారు. ఈమేరకు గురువారం కెఎన్ఆర్ సేవాదళం వ్యవస్థాపక అధ్యక్షులు మేజర్‌న్యూస్‌తో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిఫారసుతో గవర్నర్ అజారుద్దీన్ నియామకానికి ఆమోదం తెలిపినట్లు తెలిపారు. హైదరాబాద్ రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల పరిధిలో పార్టీ బలోపేతానికి కీలక పాత్ర పోషించడంతో పాటు , మాజీ భారత కెప్టెన్‌గా దేశవ్యాప్తంగా విశేష గుర్తింపు పొందిన అజారుద్దీన్, తెలంగాణ రాజకీయాల్లోనూ తనదైన పాత్ర పోశిస్తున్నందున ఆయనను మంత్రివర్గంలో చోటుకల్పించడం పట్ల ముస్లీం, మైనార్టీలంతా ఆనందం వ్యక్తం చేస్తున్నట్లు చెప్పారు. అజారుద్దీన్ మంత్రి పదవికి కేటాయిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వానికి కెఎన్ఆర్ సేవాదళం, ముస్లీం, మైనార్టీల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు బాబా వివరించారు.

## ప్రజల సేవలో పోలీసులు అహర్నిశలు కృషి : ఇన్స్పెక్టర్ రాఘవేందర్ రెడ్డి

అమరవీరుల త్యాగాలను గుర్తు చేస్తూ పోలీస్ శాఖ పట్ల విద్యార్థులకు అవగాహన








జల్ పల్లి, మేజర్ న్యూస్ (అక్టోబర్ 30):పోలీసులు ప్రజల సేవలో అహర్నిశలు కృషి చేస్తున్నారని పహాడీ షరీఫ్ ఇన్స్పెక్టర్ ఎస్.రాఘవేందర్ రెడ్డి అన్నారు. పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవం, ఫ్లాగ్ డే కార్యక్రమంలో భాగంగా పహాడీ షరీఫ్ పోలీస్ స్టేషన్ లో గురువారం ఓపెన్ హౌస్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జల్ పల్లి మున్సిపాలిటీ, శ్రీరామ కాలనీ యువన్ హై స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోలీస్ శాఖ, పోలీస్ స్టేషన్ వ్యవస్థ, కేసుల నమోదు ప్రక్రియ, నేరస్తులను పట్టుకునే విధానం, ప్రజల రక్షణ కోసం పోలీసులు తీసుకునే చర్యలు, పిల్లల రక్షణకు ఉన్న చట్టాలు, ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రత, గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే సైబర్ నేరాలు, డయల్ 100 సేవలు, పోలీస్ స్టేషన్ లోని వివిధ విభాగాల పనితీరు, కమ్యూనికేషన్ వ్యవస్థ వంటి ఆధునిక సాంకేతికలపై విద్యార్థులకు వివరించారు. పోలీసులు అహర్నిశలు ప్రజల సేవలో ఉంటారని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పహాడీ షరీఫ్ పోలీస్ స్టేషన్ ఎస్ఐలు లక్ష్మయ్య, దయాకర్, వెంకటేశ్వర్లు, మహమ్మద్ ఫైసల్ అహ్మద్, పోలీస్ సిబ్బంది, యువన్ హై స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వర్షాలకు దెబ్బతిన్న పత్తి, వరి పంటలను పరిశీలించిన ఏఓ



మాడ్గుల, మేజర్‌న్యూస్ (అక్టోబర్ 30): మాడ్గుల మండలంలో వర్షాలకు దెబ్బతిన్న పంటలను గురువారం మండల వ్యవసాయాధికారిణి అరుణకుమారి పరిశీలించారు. మండల పరిధిలోని మాడ్గుల, నర్సాయపల్లి, ఇర్విన్ తదితర గ్రామాల శివార్లలో పత్తి, వరిపంటలను ఆమె పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా పొలాల్లో చేరిన వర్షం నీటిని మొత్తం బయటకు తీసివేయాలని, పొలాన్ని ఆరబెట్టి 19:19:19 పోషకాన్ని 10 గ్రాములు లీటర్ నీటికి లేదా 13-0-45 అనే పోషకాన్ని 10 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు. దీనివల్ల పత్తి పంటకు ఎర్ర గుమ్మడి తెగులు సోకకుండ నిలువరించడంతో పాటు పత్తి చేలు ఎర్రబారడం లాంటి లక్షణాల నుండి బయటపడవచ్చని రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ఏఓ అరుణకుమారి మాట్లాడుతూ మండల వ్యాప్తంగా అన్ని వ్యవసాయ క్లస్టర్లలో వర్షాలకు దెబ్బతిన్న పత్తి పంటలను వ్యవసాయ విస్తరణ అధికారులు పరిశీలించి అంచనా వేయనున్నట్లు తెలిపారు. పంటల పరిశీలన సమయంలో ఏఓ అరుణకుమారి వెంట విస్తరణ అధికారి ప్రియాంక, ఆయా గ్రామాల రైతులు నూనె పార్వతమ్మ, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

## యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలి

★ యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అద్యక్షులు వెదిరె సికిందర్ రెడ్డి



మంచాల, మేజర్ న్యూస్ (అక్టోబర్ 30) : ఆరోగ్యంగా ఉండే యువత ప్రతి ఒక్కరు ఐదు నెలలకు ఒకసారి రక్తదానం చేసేందుకు ముందుకు రవాలని యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అద్యక్షులు వెదిరె సికిందర్ రెడ్డి పిలునిచ్చారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాల సందర్భంగా గురువారం ఇబ్రహీంపట్నంలోని వైష్ణవి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో మండలంలోని ఆరుట్ల గ్రామానికి చెందిన యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అద్యక్షులు వెదిరె సికిందర్ రెడ్డి పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా సికిందర్ రెడ్డి మాట్లాడుతూ.. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తం దానం చేయడం గర్వంగా ఉందన్నారు. అన్ని దానాల కన్నా రక్తదానం గొప్పదని కొనియాడారు. ప్రమాదాల బారిన పడిన క్షతగాత్రులకు అత్యవసర సమయంలో రక్తం అందక చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారని, అలాంటి పరిస్థితి రాకుండా అవసరమైన వారికి సరైన సమయంలో ప్రతి ఒక్క యువత రక్తదానం చేయడానికి ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంచాల సీఐ మధు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లా నాయకులు బైరిక రమాకాంత్ రెడ్డి, నాయకులు గుడిమల్ల చంద్రయ్య, మార సురేష్, పండాల శ్రీనివాస్, ఎంఆర్ఆర్ మండల అద్యక్షుడు మంథని శివ యాదవ్, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ కుకుడాల నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులకు కె.పి డెవలపర్స్ అధినేత పాండుగౌడ్ ఆశీస్సులు



మాడ్గుల, మేజర్‌న్యూస్ (అక్టోబర్ 30): మాడ్గుల మండలం నర్సాయపల్లి గ్రామానికి చెందిన చలమల్ల మణెమ్మ, జంగారెడ్డి దంపతుల చిన్న కుమారుడు, గ్రామ ఇందిరమ్మ కమిటి సభ్యుడు సురేందర్‌రెడ్డి వివాహం లావణ్య (మానస)తో గురువారం మాల్ పట్టణంలోని ఎస్.ఎస్. కన్వెన్షన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాడ్గుల మాజీ ఎంపిటిసి సభ్యులు, కె.పి. డెవలపర్స్ అధినేత కొత్త పాండుగౌడ్ స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి అభినందించారు. నూతన వధూవరులను ఆశీర్వదించినవారిలో నాయకులు రెడ్డిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, చలమల్ల రాంరెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, కడారి జంగయ్యయాదవ్, కడారి పరుశరాములు, బైకని పర్వతాలు, చిక్కుడు వెంకటయ్య, బండ రమేష్ తదితరులు ఉన్నారు.

సూర్య
11
శుక్రవారం
31 అక్టోబర్

# హరీష్ రావుని పరామర్శించిన రాచమల్ల సురేష్

శంషాబాద్, మేజర్ న్యూస్ (అక్టోబర్ 30) : మాజీమంత్రి హరీష్ రావుకి పితృవియోగం కలిగిన నేపథ్యంలో ఆయన నివాసంలో శంషాబాద్ ఎస్వీజీ డెవలపర్స్ మేనేజింగ్ డైరెక్టర్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు రాచమల్ల సురేశ్ కలుసుకుని పరామర్శించారు. ఈ సందర్భంగా రాచమల్ల సురేష్ మాట్లాడుతూ... హరీషన్న సేవలు తెలంగాణ ప్రజలకు ఎంతగానో వున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.



# భారతదేశంలో టూలింగ్ ట్రైనింగ్ అభివృద్ధికి వ్యూహాత్మక భాగస్వామ్యం




శంషాబాద్, మేజర్ న్యూస్ (అక్టోబర్ 30) : జీఎంఆర్ ఏరో టెక్నిక్ యొక్క వ్యూహాత్మక వ్యాపార విభాగంగా విమాన మెయింటెనెన్స్ ఇంజనీరింగ్ విద్యలో ప్రతిష్ఠాత్మక కేంద్రంగా నిలిచిన జీఎంఆర్ స్కూల్ ఆఫ్ ఏవియేషన్, ఆర్‌హెచ్ ఏరో సంస్థతో వ్యూహాత్మక భాగస్వామ్యంలోకి ప్రవేశించింది. జీఎంఆర్ ఏరో టెక్నిక్ భారతదేశంలో ప్రముఖ ఎయిర్‌ఫ్రేమ్ మెయింటెనెన్స్, రిపేర్ ఓవర్‌హాల్ (ఎమ్మార్వో ) సంస్థగా గుర్తింపు పొందగా, ఆర్‌హెచ్ ఏరో ప్రపంచవ్యాప్తంగా లైసెన్స్‌డ్ టూలింగ్, గ్రౌండ్ సపోర్ట్ ఎక్విప్‌మెంట్ (జీఎస్‌ఈ) లైఫ్‌సైకిల్ సేవలలో అగ్రగామిగా ఉంది. ఈ భాగస్వామ్యం భారతదేశంలో ఏరోస్పేస్ ట్రైనింగ్ మరియు నైపుణ్యాభివృద్ధిని కొత్త స్థాయికి తీసుకెళ్లే దిశగా కీలక అడుగు అవుతుంది.

టూలింగ్ ట్రైనింగ్ అనేది ప్రత్యేక పరికరాల ఆపరేషన్, రిపేర్ మరియు నిర్వహణ నైపుణ్యాలపై దృష్టి సారిస్తుంది.

ఒప్పందం ప్రకారం, ఆర్‌హెచ్ ఏరో తమ సిబ్బందిని ఈ శిక్షణ కార్యక్రమాలకు నామినేట్ చేయనుంది, తద్వారా వారు తాజా పరిశ్రమ జ్ఞానం మరియు ఉత్తమ పద్ధతులను అవలంబించగలుగుతారు.

రెండు సంస్థలు కలిసి ప్రాంతీయ అభివృద్ధి లక్ష్యాలు మరియు ఏరోస్పేస్ పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా ఉన్న నైపుణ్యాభివృద్ధి కీలక రంగాలను గుర్తించి వాటిపై దృష్టి సారించనున్నాయి.

ఈ సందర్భంగా, జీఎంఆర్ ఏరో టెక్నిక్ అధ్యక్షుడు శ్రీ అశోక్ గోపినాథ్ మాట్లాడుతూ, "ఈ భాగస్వామ్యం భారతదేశంలో విమానయాన విద్య మరియు



నైపుణ్యాభివృద్ధిని ముందుకు తీసుకెళ్లాలన్న మా ఉమ్మడి సంకల్పానికి ప్రతీక. జీఎంఆర్ స్కూల్ ఆఫ్ ఏవియేషన్ యొక్క విద్యా నైపుణ్యాన్ని, ఆర్‌హెచ్ ఏరో యొక్క గ్లోబల్ అనుభవం మరియు ఎంఈఓ లైసెన్స్‌డ్ టూలింగ్ నైపుణ్యంతో సమన్వయం చేయడం ద్వారా, అంతర్జాతీయ ప్రమాణాలకు తగిన, సాంకేతికంగా దిట్టైన భవిష్యత్ సన్నద్ధ బృందాన్ని అభివృద్ధి చేయడమే మా లక్ష్యం అన్నారు. ఈ భాగస్వామ్యంపై మాట్లాడుతూ... ఆర్‌హెచ్ ఏరో సంస్థ అధ్యక్షుడు శ్రీ ఆంథనీ టర్నర్ తెలిపారు: "భారతదేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న వైమానిక రంగాన్ని అత్యున్నత ప్రమాణాలతో మద్దతు ఇవ్వడం పట్ల ఆర్‌హెచ్ ఏరో గర్వంగా ఉంది. నైపుణ్యాభివృద్ధి అనేది భారత వైమానిక రంగ వికాసానికి, అలాగే 'మేక్ ఇన్ ఇండియా' దృష్టికి కీలక ఆధారం అని మేము గుర్తిస్తున్నాము. జీఎమ్మార్ స్కూల్ ఆఫ్ ఏవియేషన్ తో మా భాగస్వామ్యం ద్వారా, మిస్త్రితమైన ప్రామాణ్యత కలిగిన శిక్షణా కార్యక్రమాల్లో పెట్టుబడి పెట్టి, తదుపరి తరం వైమానిక నిపుణులను తీర్చిదిద్దేందుకు మరియు వారికి శక్తినిచ్చేందుకు మేము కట్టుబడి ఉన్నాము. ఈ భాగస్వామ్యం గ్రౌండ్ సపోర్ట్ ఎక్విప్మెంట్ మరియు సంబంధిత సేవల రంగంలో కొత్త ప్రమాణాలను నెలకొల్పుతుంది ఆర్‌హెచ్ ఏరో మా భారతీయ మరియు గ్లోబల్ వినియోగదారులకు ప్రపంచ స్థాయి నాణ్యత మరియు సేవలను నిరంతరం అందించడం కొనసాగుతుందన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లను త్వరితగతిన పూర్తి చేయండి : ఎంపీడీవో కుసుమ మాధురి





ఆమనగల్లు, మేజర్ న్యూస్ (అక్టోబర్ 30) మండలంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని లబ్ధిదారులు త్వరితగతిన పూర్తి చేసుకోవాలని ఎంపీడీవో కుసుమ మాధురి సూచించారు. గురువారం ఆమె ఆమనగల్లు మండలంలోని కోనాపూర్ గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలోని నర్సరీ ని సందర్శించి నిర్వాహకులకు మొక్కల పెంపకంపై తగు సూచనలు చేశారు. అనంతరం ఇందిరమ్మ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించి లబ్ధిదారులను ప్రోత్సహించి ఇండ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏ పీ ఓ మాధవరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రమ్య, ఇందిరమ్మ కమిటీ సభ్యులు కుమార్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# విద్యాసంస్థలను తరలించొద్దు : జేఏసీ ఆధ్వర్యంలో పోస్టుకార్డులతో సీఎంకు వినతి



కొడంగల్, మేజర్ న్యూస్ (అక్టోబరు 30): మెడికల్, వెటర్నరీ, నర్సింగ్ కళాశాలలు, ఇంటిగ్రేటెడ్ గురుకులాలను ఇతర ప్రాంతాలకు తరలించొద్దని, కొడంగల్‌లోనే ఏర్పాటు చేయాలని కొడంగల్ అభివృద్ధి, పరిరక్షణ కమిటీ కో కన్వీనర్‌లు ఎరన్‌పల్లి శ్రీనివాస్, మాసాని వెంకటయ్య అన్నారు. గురువారం జేఏసీ ఆధ్వర్యంలో పోస్టుకార్డుల ద్వారా నిరసన తెలిపారు. పోస్టుకార్డుల్లో విద్యాసంస్థలను శంకుస్థాపన చేసిన స్థలాల్లోనే ఏర్పాటు చేయాలని కోరారు. విద్య, వైద్యపరంగా వెనకబడిన కొడంగల్ ప్రాంతంలో ఉన్నత విద్యాసంస్థల ఏర్పాటుతో అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు పవన్‌కుమార్ లాహోటి, బస్వరాజ్, పకీరప్ప, చిన్నయ్య, నవీన్‌సింగ్, మదన్, నాగప్ప తదితరులు పాల్గొన్నారు.




రిలే నిరాహార దీక్షకు అనుమతి కోసం వినతి

జేఏసీ ఆధ్వర్యంలో విద్యాసంస్థలను ఇతర ప్రాంతాలకు తరలించొద్దంటూ ఈ నెల 1 నుంచి కొడంగల్ అంబేద్కర్ చౌరస్తాలో చేపట్టనున్న రిలే నిరాహార దీక్షకు జేఏసీ కో కన్వీనర్‌లు జీ.సురేశ్‌కుమార్, ఎరన్‌పల్లి శ్రీనివాస్, రమేశ్‌బాబు, డాక్టర్ నవాజ్, భీమరాజు, సూర్యనాయక్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి, డీఎస్పీ శ్రీనివాస్‌లకు అనుమతి కోరుతూ వినతి పత్రం అందించారు.

# తిరుమలగిరి డివిజన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి రక్తదాతలనుంచి విశేష స్పందన

సిటీబ్యూరో,మేజర్‌న్యూస్: అన్ని దానాలకెల్ల రక్తదానం ఎంతో గొప్పదని,ప్రాణాపాయస్థితిలోనున్న రోగికి రక్తదానం చేయడంవల్ల,వారికి పునర్ జన్మను ప్రసాదించినట్లు అవుతుందని,మానవతాదృక్పథంతో ప్రతి ఒక్కరు ఏడాదిలో కనీసం ఒకసారైనా స్వచ్ఛందంగా రక్తదానం చేసి,ప్రాణ దాతలు కావాలని తిరుమలగిరి డివిజన్ ఏ.సి.పి. రమేష్ పిలుపునిచ్చారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం తిరుమలగిరి డివిజన్ ఏ.సి.పి. రమేష్ ఆధ్వర్యంలో కార్ఖానా పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు.

# శంషాబాద్‌లో డిగ్రీ, ఫార్మసీ కళాశాలల బంద్

**- స్కాలర్ షిప్స్, ఫీజు రియంబర్స్ మెంట్ అడిగితే కాలేజీలపై విజిలెన్స్ దాడులా - పెండింగ్ ఫీజురీయంబర్స్ మెంట్స్, స్కాలర్ షిప్స్ విడుదల చేయాలి - ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కేవై ప్రణయ్**




శంషాబాద్, మేజర్ న్యూస్ (అక్టోబర్ 30) : ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కెవైస్ ప్రణయ్ ఆధ్వర్యంలో శంషాబాద్ లో కళాశాల బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ప్రణయ్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో గత ఆరేళ్ల నుండి 8500 కోట్ల పెండింగ్ లో ఉన్న ఫీజు రీయంబర్స్ మెంట్స్,స్కాలర్ షిప్స్ విడుదల చేయకుండా కాలయాపన చేస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నాయి ప్రభుత్వాలు అన్నారు. విద్యార్థులకు బకాయిలు విడుదల చేయకపోవడంతో తమ పై చదువుల కోసం సర్టిఫికేట్స్ కోసం కళాశాల యాజమాన్యాల దగ్గరికి వెళితే ఫీజులు కడితే తప్ప సర్టిఫికెట్స్ ఇవ్వలేము అంటున్న పరిస్థితి ఉన్నది. పెండింగ్ లో ఉన్న స్కాలర్ షిప్స్, ఫీజు రియంబర్స్ విడుదల చేయండి అని అడుగుతే కళాశాల పై విజిలెన్స్ దాడులు అని బెదిరింపులు చేస్తున్న దుస్థితి ఉన్నది. ప్రభుత్వం ఏర్పడి 2ఏండ్లు కావొస్తున్న విద్యార్థులకు ఇవ్వాల్సిన 8వేల కోట్ల రూపాయల పైగా స్కాలర్ షిప్స్, ఫీజు రీయింబర్స్ మెంట్ ఇప్పటికీ విడుదల చేయకపోవడం సిగ్గు చేటు అన్నారు. ఒక పక్క కళాశాల యాజమాన్యాలు ప్రభుత్వం విడుదల చేయకపోతే క్లాసులు నడపకుండా తరగతుల బహిష్కరించిన దుస్థితి నెలకొన్నది. దీని ద్వారా విద్యార్థులు తమ క్లాసులు నష్టపోతున్నారు. కళాశాలల యాజమాన్యాలు ఫీజులు కట్టమని ఒత్తిడి చేయకుండా విద్యార్థులకు సర్టిఫికెట్ ఇవ్వాలని అన్నారు.ఇంత జరుగుతున్న విద్యా వ్యవస్థ పట్ల రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకుండా పట్టి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు అన్నారు. ఒక పక్క తల్లి దండ్రులు ఫీజులు కట్టలేక ప్రభుత్వం స్కాలర్ షిప్ విడుదల చేయక విద్యార్థులు తమ చదువులను మధ్యలోనే ఆపివేస్తు పార్ట్ టైమ్ జాబులు చేసుకుంటున్నారు అని తెలిపారు. జిల్లాలో విద్యార్థులకు దాదాపు 750 కోట్ల రూపాయలు పెండింగ్ ఉన్నాయి. రేవంత్ రెడ్డి గారు విద్యా రంగానికి పెద్ద పీట వేస్తా అన్నారు కానీ ఆచరణలో మాత్రం శూన్యం అన్నారు.నేటికి విద్యా రంగానికి విద్యాశాఖ మంత్రి లేకుండా ప్రభుత్వాన్ని నడుపుతున్న తీరు చూస్తే విద్యా వ్యవస్థ పట్ల తమ చిత్త శుద్ధి ఉన్నదో అర్థం అవుతుంది అన్నారు. ఆర్థిక శాఖ మంత్రి బట్టి విక్రమార్క దఫా దఫాలుగా విడుదల చేస్తాం ముందుగా 1200 కోట్లు విడుదల చేస్తామని చెప్పి మాట తప్పారు. మాటలే తప్ప చేతల్లో చేసిందేమీ లేదన్నారు. నిన్న తక్షణమే 303కోట్లు విడుదల చేయాలని చెప్పారు. రాస్తోరోకో లు బంద్ లు నిర్వహిస్తే బిక్షం వేసినట్టుగా ఉన్నది ప్రభుత్వం బకాయిలు విడుదల చేస్తున్న తీరు. ప్రభుత్వ ఎప్పటికైనా స్పందించి వెంటనే పెండింగ్ లో ఉన్న మొత్తం స్కాలర్ షిప్స్, ఫీజు రియాంబర్స్ మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో అసెంబ్లీ ముట్టడి చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, తరుణ్, సతీష్, తనిష్, సాయి, పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు, మేజర్ న్యూస్ (అక్టోబర్ 30) ఆమనగల్లు పట్టణానికి చెందిన కొమ్ము వెంకటయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. గురువారం నిర్వహించిన మృతుని దశ దినకర్మ లో మాజీ వైస్ ఎంపీపీ నిట్ట నారాయణ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ వసుపుల జంగయ్య పాల్గొని మృతుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుని కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా మాజీ వైస్ ఎంపీపీ నిట్ట నారాయణ మృతుని కుటుంబానికి పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, రామచంద్రయ్య, పురుషోత్తం, మైసయ్య, మృతుని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# బడంగ్ పేట్‌లో పోచంపల్లి కో-ఆపరేటివ్ బ్యాంకు ప్రారంభం

**- "ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి: పారిజాత నర్సింహారెడ్డి"** **- "గృహప్రవేశ మహోత్సవానికి హాజరైన పలువురు నాయకులు"**



బాలాపూర్, మేజర్ న్యూస్ (అక్టోబర్ 30): బడంగ్‌పేట్‌లో పోచంపల్లి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ 17వ బ్రాంచ్ ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజల ఆర్థికాభివృద్ధికి సహకార బ్యాంకులు ముఖ్య భూమిక వహిస్తున్నాయని తెలిపారు. అదేవిధంగా రాజి రెడ్డి గృహప్రవేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పారిజాత నర్సింహారెడ్డి శుభకార్యానికి హాజరైన మాజీ మేయర్, ప్రజలను ఆత్మీయంగా కలుసుకున్నారు. బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్లో రోమా %×ు% కాలనీలో రాజి రెడ్డి నూతన గృహప్రవేశ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని కుటుంబ సభ్యులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా పారిజాత నర్సింహారెడ్డి పలువురు నాయకులు కలిసి రాజి రెడ్డి కుటుంబానికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, కొత్త ఇల్లు సుఖశాంతులు నింపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్ రెడ్డి, పెద్దబావి సుదర్శన్ రెడ్డి, నాయకులు బోయపల్లి రాఘవేందర్ రెడ్డి, సామ భాస్కర్ రెడ్డి, పెద్దబావి బాబు, కృష్ణ రెడ్డి, ఆర్య వైశ్య సంఘం నాయకులు ఎన్.శ్రీనివాస్ గుప్త, చైర్మన్ తడక రమేష్, బ్రాంచ్ హెడ్ రేష్మ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



## బీసీ వర్గీకరణ రిజర్వేషన్లు అమలు చేయాలి - బొల్లంపల్లి రాంబాబు

**- అన్నీ బీసీ వర్గాలకు సముచిత న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలి"**

**-"కాంగ్రెస్ మేనిఫెస్టోలో చేసిన హామీని నిలబెట్టాలని డిమాండ్.."**



బాలాపూర్, మేజర్ న్యూస్ (అక్టోబర్ 30): రాష్ట్రంలో బీసీలకు ఏబిసిడి వర్గీకరణతో కూడిన 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని బొల్లంపల్లి రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాలాపూర్ మండలం బడంగ్‌పేట్‌లో మంగళి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొల్లంపల్లి రాంబాబు ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఏబీసీడీ వర్గీకరణతో కూడిన 42 శాతం బీసీ రిజర్వేషన్లు తక్షణం అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ,కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి సభలో, మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని నెరవేర్చాల్సిన సమయం వచ్చిందని అన్నారు. రాష్ట్రంలో వందకు పైగా బీసీ కులాలకు రాజకీయ అవకాశాలు దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు.
అగ్రకులాలకు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు ఇచ్చేటప్పుడు లేని అడ్డంకులు బీసీలకు ఎందుకు..?,అని ప్రశ్నించిన రాంబాబు. రాజ్యాంగం చెప్పిన సమాన హక్కులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటున్న పార్టీలకు తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని ఆయన హెచ్చరించారు. బీసీ సంఘాలు సమిష్టంగా ముందుకు వచ్చి, వర్గీకరణతో కూడిన రిజర్వేషన్ల సాధన కోసం బలమైన ఉద్యమం చేపట్టాలని బొల్లంపల్లి రాంబాబు పిలుపునిచ్చారు.

# హర్జన్‌వాడలో ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంప్.. ఆరోగ్య అవగాహనతో సేవా స్ఫూర్తి

**- "ఎయిడ్స్, ప్లాస్టిక్ రహిత ర్యాలీలు.. మెగా హెల్త్ క్యాంప్‌లో ప్రజలకి వైద్య సేవలు"** **- "జిడిసి బడంగ్‌పేట్ విద్యార్థుల స్ఫూర్తిదాయక సేవా కార్యక్రమాలు"**




బాలాపూర్, మేజర్ న్యూస్ (అక్టోబర్ 30): బడంగ్‌పేట్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (జీడీసీ) ఆధ్వర్యంలో హర్జన్‌వాడ గ్రామంలోని నాదర్‌గుల్ యూపీఎస్ పాఠశాలలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం 6వ రోజు కార్యక్రమాలు ఉత్సాహంగా కొనసాగాయి. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ ఎన్. జ్యోతి, డాక్టర్ సిహెచ్. వెంకట్ రెడ్డి మార్గదర్శకత్వంలో విద్యార్థులు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా గ్రామ ప్రజల్లో ఆరోగ్య మరియు పర్యావరణ స్పృహ పెంచేందుకు ఎయిడ్స్ అవగాహన ర్యాలీ, ప్లాస్టిక్ రహిత గ్రామం అవగాహన ర్యాలీ నిర్వహించారు. వాలంటీర్లు ప్లకార్డులు, పోస్టర్లతో ప్రజలకు సందేశాలు చేరవేశారు. తరువాత మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించబడింది. ఇందులో బీపీ చెక్, షుగర్ టెస్ట్, సిబిపి, థైరాయిడ్, లిపిడ్ ప్రొఫైల్ వంటి పరీక్షలు ఉచితంగా చేశారు. స్త్రీల ఆరోగ్య సమస్యలపై ప్రత్యేక వైద్య సలహాలు ఇవ్వడానికి గైనకాలజిస్ట్ కూడ హాజరయ్యారన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్. ప్రసాద్ అధ్యాపకులతో కలిసి శిబిరాన్ని పర్యవేక్షించారు. విద్యార్థులు, గ్రామస్తులు ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం డాక్టర్ ఎన్. జ్యోతి అందరితో ఆరోగ్య ప్రతిజ్ఞ చేయించి, పరిశుభ్రత, ఆరోగ్యం, సమాజ సేవపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్ఎం శ్రీ లక్ష్మయ్య చేత జెండా ఎగురవేసి కార్యక్రమం నిర్వహించబడింది. సేవా స్ఫూర్తితో రోజు మొత్తం వాలంటీర్లు అంకితభావంతో పనిచేయడం అందరి ప్రశంసలు అందుకున్నారని కొనియాడారు.

## పంట పొలాలలో నిలిచిన నీటిని వెంటనే తొలగించాలి – ఏవో శ్రీనివాస్ గౌడ్



ఆమనగల్లు, మేజర్ న్యూస్ (అక్టోబర్ 30) మొంథా తుఫాన్ ప్రభావంతో మండలంలో రెండు రోజులుగా కురిసిన వర్షాలకు పంట పొలాలలో నిలిచిన నిలువ ఉన్న నీటిని రైతులు వెంటనే తొలగించాలని మండల వ్యవసాయ అధికారి పెద్ది శ్రీనివాస్ గౌడ్ సూచించారు. గురువారం వ్యవసాయ విస్తరణ అధికారులతో కలిసి మండలంలో వర్షానికి నష్టపోయిన పంటలను పర్యవేక్షించి అంచనా వేసి వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ నిన్న కురిసిన అధిక వర్షానికి ప్రతి పంట పొలంలో అధికంగా నీరు చేరిందని రైతులు పత్తి పంట లోని నీటిని వెంటనే తీసివేసి ఎక్కడ నీరు నిలువ ఉండకుండా జాగ్రత్త పడాలని చెప్పారు. దీంతో పత్తి పంట తిరిగి పూర్వస్థితికి చేరుకుంటుందని వివరించారు. వర్షానికి వీచిన గాలులకు వరి పంట అక్కడక్కడ నేలపై పడి పోయినదని రైతులు ఆందోళన చెందకుండా పడిపోయిన వరి మొదల్లను జాగ్రత్తగా పైకి లేపి వాటికి జడలు వేసి నిలబడేటట్టు చేసుకోవాలని తెలిపారు. ఆ పొలంలో నిలువ ఉన్న నీటిని తొలగించేందుకు పాయలు ఏర్పాటు చేసుకొని నీరు బయటకు పోయేటట్టుగా చర్యలు తీసుకోవాలన్నారు. చివరి దశలో ఉన్న వరి పై మొలక, గింజలు రంగు మారకుండా లీటర్ నీటికి 50 గ్రాముల కళ్ళు ఉప్పు కలిపి పడిపోయిన వరి మొక్కల కంకులపై పడే విధంగా పిచికారి చేసినట్లయితే వరి కంకులపై గింజలు మొలకెత్తవని, గింజ రంగు మారదని పేర్కొన్నారు. పంట పొలాల పరిశీలనలో ఆరు ఎకరాలలో వరి పైరు నేలకొరిగినట్లు గమనించామని ఈ సమాచారాన్ని ప్రాథమిక నివేదికగా ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు శ్రీనివాస్ గౌడ్ వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ లు నికిత, భూదేవి, గాయత్రి, మీనాక్షి పాల్గొన్నారు.

# అన్ని బస్తీలకు రవాణా సౌకర్యం కల్పిస్తాం.. కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి

**- "ఉచిత బస్సు ప్రయాణంతో మహిళలు, విద్యార్థులకు ఊరట.."** **- "మామిడిపల్లికి త్వరలోనే ఆర్టీసీ బస్సులు"**



బాలాపూర్, మేజర్ న్యూస్ (అక్టోబర్ 30): నియోజకవర్గ అన్ని బస్తీలకు రవాణా సౌకర్యం కల్పిస్తామని, మామిడిపల్లి గ్రామానికి త్వరలోనే ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించనున్నట్లు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి (కేఎల్ఆర్) తెలిపారు. బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అతిపెద్ద గ్రామమైన మామిడిపల్లిలో రవాణా సౌకర్యం లేక ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు పేర్కొన్నారు.
మహిళలు, విద్యార్థులు, చిరు ఉద్యోగులు పట్టణ ప్రాంతాలకు వెళ్లేందుకు సొంత వాహనాలపై ఆధారపడాల్సి వస్తోందని శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ నరేష్ గౌడ్, ఇందిరమ్మ కమిటీ చైర్మన్ విజయ్ గౌడ్, లాల్ సతీష్, జంగయ్య తదితరులు కేఎల్ఆర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ... ప్రజలకు రవాణా సౌకర్యం అందించేందుకు ఇప్పటికే ఆర్టీసీ అధికారులతో చర్చలు జరిపామని, త్వరలోనే బస్సులు మామిడిపల్లికి చేరుకుంటాయని చెప్పారు. ప్రతి బస్తీకి, ప్రతి కాలనీకి బస్సు సౌకర్యం అందే వరకు కృషి చేస్తామన్నారు. ఉచిత ప్రయాణ పథకంతో మహిళలు, విద్యార్థులు డబ్బులు ఆదా చేసుకుంటున్నారు. ఇకపై బస్సు లేని ఊరు, కాలనీ ఉండదు అని కేఎల్ఆర్ స్పష్టం చేశారు. ఇటీవలే ఆర్కేపురం డివిజన్ పరిధిలో పలు కాలనీలకు బస్సు సౌకర్యం కల్పించడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఆదిళ్ల నరేందర్, రాజ్ కుమార్, చీమలదారి చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

# పేదింటి ఆడపడుచు పెళ్లికి మాజీ సర్పంచ్ సహాయం

ఆమనగల్లు, మేజర్ న్యూస్ (అక్టోబర్ 30) ఆమనగల్లు మండలంలోని శెట్టిపల్లి గ్రామంలో గ్రామ మాజీ సర్పంచ్ ఎగిరిశెట్టి గోదాదేవి సత్యం గురువారం పేదింటి ఆడపడుచు పెళ్లికి సహాయం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన శ్రీను మై బమ్మ దంపతుల కుమార్తె శ్రావణి వివాహం సందర్భంగా 10,116 రూపాయలఆర్థిక సహాయం, పట్టుచీర అందజేశారు. అనంతరం మాట్లాడుతూ గ్రామంలో ఇప్పటికీ 95 మంది ఆడపిల్లల వివాహాలకు తన వంతు సహాయం అందజేసినట్లు వివరించారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ వెంకటయ్య, గ్రామస్తులు జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

